
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 24 జూన్ 2024 | 3





అల్లూరు కలెక్టర్ దినేష్‌కుమార్

అల్లూరు జిల్లా కలెక్టర్‌గా రావడం ఆనందంగా ఉంది..

- నాకు అల్లూరు జిల్లా కొత్తేంకాదు
- గతంలో ఐటీడీఏ పీవోగా పనిచేశా
- గిరిజనం అంటే చాలా ఇష్టం
- జిల్లా అభివృద్ధికి పాటుపడతా
- 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ దినేష్‌కుమార్

(రంపచోడవరం)

నాకు ఈ జిల్లా కొత్తేంకాదు.. నేను ప్రజలకు కొత్త కాదు.. అంతా నాకు సుపరిచితమే.. ఈ జిల్లాకు రావడం చాలా ఆనందంగా ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రజలు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో సమగ్రాభివృద్ధి సాధించడమే లక్ష్యమని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా నియమితులైన ఆయన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు.

మీకు అల్లూరి జిల్లాతో అనుబంధం ఎలా?

గతంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా చంద్రబాబు ప్రభుత్వంలో పని చేశా. నాడు గిరిజన అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల పునరావాసం అంశాలపై పురోగతిని చూపించా. అది గుర్తుపెట్టుకున్నారో ఏమో కానీ.. విభజిత జిల్లాలో ఇప్పుడు రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏ ప్రాంతాలతో ఉన్న జిల్లాకు కలెక్టరుగా నియమించారు. నాకు చాలా ఆనందంగా ఉంది. సమస్యలు ఎక్కడ ఉంటాయో అక్కడ ఉండడం పరిష్కరించడమే నాకు అలవాటు.

మా జిల్లా అంటే ఎందుకు ఇష్టం..

అల్లూరి జిల్లా అంటేనే ప్రకృతి ఒడిలో సహజ వనరులతో, నిష్కల్మషమైన గిరిజనులతో నిండి ఉన్న ప్రాంతం. అందుకే అల్లూరి జిల్లా అంటే ఇష్టం. ఈ ప్రాంతంలో సేవ చేయడాన్ని ఎంతో పవిత్రంగా, గొప్పగా భావిస్తా. జిల్లాలో ఉన్న రంపచోడవరం, పాడేరు, చింతూరు ఐటీడీఏలకు ఛైర్మన్‌గా ఉన్నా. అందువల్ల జిల్లాలో ఆదాయ వనరులపై నాకు అవగాహన ఉంది. గతానుభవంతో గిరిజనుల సమగ్రాభివృద్ధికి నిర్దిష్టమైన ప్రణాళికలను అమలు చేస్తా. గిరిజన ఆరోగ్యం, విద్య తదితర మానవవనరులను మెరుగుపర్చే కృషి సాగిస్తా. ఐటీడీఏల పాలకవర్గ సమావేశాలను సక్రమంగా నిర్వహింపజేస్తూ ఆయా ప్రణాళికలను అమలు చేస్తా.

గతంలో మీ మార్కు ఏంటి?

రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా గిరిజనాభివృద్ధికి బాటలు వేశా. గిరిజన విద్యాసంస్థల్లో పౌష్టికాహారాన్ని అందించే దిశగా అక్షయపాత్ర అనే వ్యవస్థను కూడా ఇక్కడ పరిచయం చేశా. తద్వారా గిరిజన విద్యాలయాల్లో ఆహారాన్ని అందించే పథకాల్లో అక్రమాలను నిరోధించా.

పోలవరానికేం చేశారు?

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, దాని కింద పునరావాస చర్యలు, ముంపు గ్రామాలను ఖాళీ చేయించే అంశాలపై పరిశీలనకు గత చంద్రబాబు ప్రభుత్వం చైనాలోని త్రీగాడ్జెస్ ప్రాజెక్టు పర్యటకు పంపించారు. పరిశీలన అనంతరం నివేదిక ఇచ్చా.ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో నివేదిక మూలన పడింది. ఫలితంగా పునరావాసాన్ని పూర్తి చేయకుండా పోలవరం నిర్వాసితులను జగన్ ప్రభుత్వం గ్రామాలు ఖాళీ చేయించేయించిన విషయం తెలిసిందే! తిరిగి చంద్రబాబు ప్రభుత్వంలో కలెక్టర్ నియమితుడినయ్యా ఇప్పుడా ఆ నివేదిక చాలా ఉపయోగపడుతుంది. పోలవరం ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యతా అంశం.. అందులో నిర్వాసితుల పునరావాసం కూడా కీలకమే. పునరావాస అంశాలపై నివేదిక రప్పించుకుని, పునరావాస పురోగతికి ఖచ్చితమైన టార్గెట్లను పెట్టి నిర్దిష్ట కాలాన్ని నిర్దేశించి చర్యలు తీసుకుంటా.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ మేరకు పటిష్టమైన చర్యలు తీసుకుంటాన్నారు. పూర్తి పారదర్శకతతో అవినీతి రహితంగా జిల్లాలో పాలన సాగించే దిశగా అన్ని చర్యలు తీసుకుంటానన్నారు.



అక్రమ భవనానికి నోటీస్ అంటిస్తున్న మునిసిపల్ ఉద్యోగులు.. మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్ జారీ చేసిన నోటీస్

భయపెట్టి భవనం కట్టేశారు!

- అక్రమంగా వైసీపీ భవనం
- కనీస అనుమతుల్లేవ్
- రూ.5 కోట్లతో నిర్మాణం
- నోటీసు ఇచ్చిన అధికారులు
- వారం రోజులు గడువు
- వైసీపీ కేడర్‌లో వణుకు

రాజమహేంద్రవరం,జూన్ 23(ఆంధ్రజ్యోతి) : వైసీపీ అక్రమ భవనంపై అధికారులు ఇన్నాళ్లకు కళ్లు తెరి చారు..గత ఏడాదిగా భవన నిర్మాణం సాగుతున్నా భయంతో అధికారులు పట్టించుకోలేదు. అయితే ప్రభుత్వం మారడం..భవన నిర్మాణం అక్రమమని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది.ఇన్నాళ్లకు అధికారులు ఆ భవనానికి నోటీసు అంటించారు. దీంతో వైసీపీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.వైసీపీ ప్రభుత్వం రాజమ హేం ద్రవరంలోని ఆర్‌అండ్‌బీకి చెందిన సుమారు రూ.100 కోట్ల విలువైన 2 ఎకరాల భూమిని ఏడాదికి కేవలం రూ.1000 లీజుకు తీసుకుని ఎటువంటి అనుమతులు లేకుండా వైసీపీ కార్యాలయాన్ని నిర్మించింది. ఇది అక్రమ నిర్మాణం అంటూ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్(ఐఏఎస్ అధికారి) కె.దినేష్‌కుమార్ నోటీసు ఇచ్చారు. వైసీపీ జిల్లా ప్రెసిడెంట్ పేరుతో నోటీసును వైసీపీ కార్యాలయ స్థంభానికి అతికించారు. ఈ భవనం సుమారుగా పూర్తయింది. ఇక ఫినిషింగ్ టచ్ మాత్రమే. భూమిని లీజుకు తీసుకున్న సమయంలో కూడా నిబంధనలు పాటించలేదు.నగర పాలక సంస్థ కౌన్సిల్ తీర్మానం తీసుకోవాలి. కానీ తీసు కోలేదు. ఇక్కడ పాలకవర్గం లేదు. కానీ జిల్లా కలెక్టర్ స్పెషలాఫీసర్‌గా ఉన్నారు.కేవలం రెవెన్యూ అధికారులే ఏడాదికి రూ.1000 లీజుతో 2 ఎకరాల భూమిని కట్టబెట్టేశారు.సుమారు 5 కోట్ల ఖర్చుతో భవనం నిర్మించారు. దీనికి ఎటువంటి అనుమతులు తీసుకోకపోవడంతో వైసీపీ ఇరకాటంలో పడింది..నగరంలో భారీ భవంతులు నిర్మించాలంటే రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (రుడా) అనుమతి తీసుకోవాలి.కనీసం ఇంతవరకూ అనుమతికి దరఖాస్తు కూడా ఇవ్వకుండా ఏకంగా ఏడాదిలో ఓ ఇంద్రభవనంలా వైసీపీ జిల్లా కార్యాలయాన్ని నిర్మించారు.దీని అనుమతికి తమకు ఎటువంటి దరఖాస్తు రాలేదని రుడా వైస్ ఛైర్మన్ బాలస్వామి తెలిపారు.మరో ప్రక్క మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ నోటీసు ఇచ్చారు.వారం రోజులు గడువు ఇచ్చామని,వారి సమాధానం ఏమిస్తారో చూసి తర్వాత చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఒక్క చాన్స్ అంటే నమ్మి ఫ్యాన్‌ని 151 వద్ద పెట్టారు.. అంత స్పీడ్ తట్టుకోలేకపోతున్నాం.. మాకు ప్రజలు 151 ఇచ్చారు కదా అని ఇష్టానుసారం చేస్తున్నారు.. అలా కాదు ఈ సారి జీరోలో పెట్టండి.. ఇదీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి ఇచ్చిన పిలుపు.. గోదావరి జిల్లాల ప్రజలు అచ్చంగా ఇలాగే చేశారు.. ఒక్క సీటు ఇవ్వలేదు.. దీంతో అప్పటి వరకూ ప్రగల్బాలు పలికిన వైసీపీ నాయకులు నేడు మచ్చుకైనా కానరావడంలేదు.. కూటమి సునామీలో ప్రజా తీర్పుతో గల్లంతైపోయారు.. రెక్కలు తెగిన పక్షుల్లా మారిపోయారు. నేడు ఏ పార్టీలో ఖాళీగా ఉందా అని పక్క చూపులు చూస్తున్నారు.. ఏదో ఒక విధంగా నామినేటెడ్ పదవులను నిలబెట్టుకోవాలని మరికొందరు చూస్తున్నారు. ఇలా వైసీపీ నాయకగణం ఎవరి వేటలో వారున్నారు..



రెక్కలు తెగిన పక్షులు!



కూటమిని కాకాపడుతున్న 'గాలి'వీరులు

- గోదావరి జిల్లాల్లో ఫ్యాన్‌కు జీరో
- చిన్నమ్మ చెప్పిందే.. ఓటర్లు చేశారు
- ప్రజా తీర్పుతో అయోమయం
- బయటకు రాలేకపోతున్న నేతలు
- శపథాల మాటేంటని ప్రశ్నిస్తున్న జనం
- అటూ ఇటూ చూస్తున్న వైసీపీ నాయకులు
- అయితే జనసేన..కాదంటే బీజేపీ?
- నామినేటెడ్ పదవులూ వదలని వైనం
- గత ప్రభుత్వంలో గోపీల ఆందోళన
- నిస్తేజంగా మారిన వైసీపీ కేడర్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'గాలి'వాటం పార్టీ అండ చూసుకొని రెచ్చిపోయారు. జగన్ తన చెప్పుతో పోల్చినా ఆనంద పడిపోయారు. చట్టం దలదించుకొనేలా దందాలు సాగించారు. అధినేత దగ్గర నుంచీ వీధి నాయకుడి వరకూ అక్రమాల్లో మునిగితేలారు. ఐదేళ్ల పాటు జనాలను పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రతిపక్షంపై రాజకీయ కక్ష సాధించడానికి తమను ప్రజలు ఎన్నుకున్నట్టుగా బరితెగించారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాలు ఉండవనే మాటే మరిచారు. వైసీపీ అధికారంలోకి రాకపోతే రాజకీయ సన్యాసం చేసేస్తామంటూ శపథాలు చేశారు. అన్నీ చూసి విసిగిపోయిన జనం ఓటుతో చాచి కొడితే చికిత్సకు పనిచేయని శరీరంలా మారిన పార్టీని చూసుకొని మొుఖ్ల మంటున్నారు. పార్టీ దాదాపు భూస్థాపితం కావడానికి 11 అడుగుల దూరంలో మాత్రమే ఉండడంతో రాజకీయ భవిష్యత్తు తలచుకొని కళ్లు వాచిపోయేలా రోదిస్తున్నారు. 'కూటమి'లో కలిసిపోవడానికి ప్రయత్నాలూ ఆరంభించారు. ఈ క్రమంలో వైసీపీ ఖాళీ కావడానికి దగ్గర పడుతుండడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ఉత్తుత్తి శపథలేనా?

వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందనే భ్రమలో కొందరు వైసీపీ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడేశారు. పార్టీ మళ్లీ అధికారంలోకి రాకపోతే రాజకీయ సన్యాసం చేస్తామంటూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాజమండ్రి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి శపథం చేశారు. వైసీపీ అధికారం మాట అలా ఉంచితే అంధకారంలోకి వెళ్లిపోయి 19 రోజులు గడిచింది. అయినా తమ మాట నిలబెట్టుకొనే విషయంపై వైసీపీ నాయకులు కిక్కురుమనడం లేదు. ఈ కోవలోనే శపథం చేసిన ముద్రగడ పద్మనాభం తన మాట నిలబెట్టుకుంటూ పద్మనాభరెడ్డిగా మారిపోయారు.దీంతో మిగిలిన వాళ్లు తమ శపథాలు ఎప్పుడు నెరవేర్చుతారా అని జనం ఎదురు చూస్తున్నారు.మరి కొంతమంది వైసీపీ నాయకులు నామినేటెడ్ పదవులను ఇంకా పట్టుకొని వేలాడుతున్నారు. గెంటేసే వరకూ వెళ్లేది లేదనే దర్పం ప్రదర్శిస్తున్నారు. వైసీపీ నాయకులు ఎవరూ వీధుల్లో కానరావడం లేదు.తమ విపరీతమైన ప్రవర్తనతో విసిగిపోయిన జనం తమను పురుగుల మాదిరిగా చూస్తారనే భయంతో ముఖం చెల్లగా బయట తిరగలేకపోతున్నారని ఆ పార్టీలోని కొందరు అంటున్నారు. జనాలు నిలదీస్తే ఏమి సమాధానం చెప్పాలో కూడా తెలియక ఇళ్లకు కొందరు, పొరుగూళ్లకు కొందరు పరిమితమైపోయారని చెబుతున్నారు.

వర్గపోరుతో నలిగిపోయారు

వర్గపోరు, అహంభావానికి వైసీపీ పెట్టింది పేరు. పైగా ఎప్పుడు ఎవరిని ఎక్కడి నుంచి పీకేసి ఎక్కడికి పంపిస్తారో తెలియని పరిస్థితిలో క్యాడర్ అయోమయంలో కొట్టుమిట్టాడింది. ఎప్పుడు ఎవరికి జైకొట్టాలో తెలియని పరిస్థితి దాపురించింది. వైసీపీ రాజకీయ బదిలీలు, ఎప్పుడు ఎవరు ఎక్కడ నుంచి బరిలో ఉంటారో తెలియని గందరగోళంతో కార్యకర్తలు ఆందోళనలో పడిపోయారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నుంచి గోడదూకిన వారికి పెద్దపీట మాట ఎలా ఉన్నా సముచిత స్థానం కూడా వైసీపీలో దక్కలేదు.అయినా చేసిన తప్పునకు నెట్టుకురాలేక తప్పలేదు. టీడీపీలో నగర, ఉన్నతస్థాయి పదవులు అనుభవించిన వారు కూడా వైసీపీ పంచన చేరారు. ఇప్పుడు వారి రాజకీయ జీవితం కుడితిలో పడ్డ ఎలక మాదిరిగా తయారైంది. అటు వైసీపీ పని అయిపోవడం.. ఇటు సొంత గూటికి చేరడానికి ముఖం చెల్లక సతమతమవుతున్నారు. అప్పుడు తప్పుచేశామనే భావన వారిలో కనిపిస్తోంది. ఉదాహరణకు టీడీపీలో కార్పొరేటర్‌గా పదవి అలంకరించిన వారికి వైసీపీలోకి దూకిన తర్వాత కనీసం వీధి నాయకులకు ఉన్నపాటి గౌరవం కూడా దక్కకపోవడం గమనార్హం.


ఉమ్మడి జిల్లాలో ఫ్యాన్ జీరో..

ప్రజా స్వామ్యంలో ప్రజలదే అంతిమ తీర్పు అనే నిజాన్ని వైసీపీ నాయకులు గాలికి వదిలేశారు. మళ్లీ మేమే గెలుస్తామంటూ బింకాలుపోయారు.అధినేత చేలో మేస్తే తాము గట్టున మేస్తామా అంటూ వైసీపీ చోటామోటా నాయకులు సైతం రెచ్చిపోయారు. ఇష్టారాజ్యంగా దందాలు సాగించారు. తాజా మాజీ ఎంపీ అయితే టీడీపీ నాయ కులను అక్రమంగా కేసుల్లో ఇరికించడమే పనిగా పెట్టుకు న్నారు. మొదటిసారి ఎంపీగా నెగ్గగానే ఏకంగా మోదీ, చంద్రబాబుపైనే సవాళ్లు విసిరే దుస్సాహసం చేశారు. ఇలాంటి వాళ్లను చూసి క్యాడర్ కూడా అలాగే తయారైంది. ఈ ఎన్నికల్లో వైసీపీ అత్యంత ఘోరంగా పరాజయం పాలైంది. 175కి కేవలం 11 సీట్లతో సరిపెట్టుకోక తప్పలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 21 స్థానాలు ఉండగా ఒక్క స్థానంలోనూ గెలవలేదు. జిల్లా ఓటర్లు అటు పార్ల మెంట్, ఇటు అసెంబ్లీలోనూ కనీసం చోటివ్వలేదు. దీంతో వైసీపీ ఇక కూడదీసుకోలేదనే సంకేతాలు బలంగానే చక్కర్లు కొడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తమ రాజకీయ జీవితం ఏంటని అటు నాయకులు, ఇటు క్యాడర్ దడదడలాడి పోతోంది. టీడీపీ నుంచి వైసీపీలోకి వచ్చి టీడీపీ నాయకులపై విరుచుకుపడిన వాళ్లు బెంబేలెత్తిపోతున్నారు. కొం దరు పొరబాటును గ్రహించి ముందు చూపుతో ఎలా గోలా ఎన్నికలకు ముందే సైకిల్ ఎక్కేశారు. వారికి అధి కంగా కాకపోయినా సముచిత గౌరవం దక్కుతోంది. కానీ వైసీపీ గాలిని చూసుకొని ఇష్టానుసారం బరితెగించిన వాళ్లకు మాత్రం వెన్నులో వణుకుపుడుతోంది. ఇదే విష యంపై అంతర్గతంగా కుమ్ములాటలు జరుగుతున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా కొందరు వైసీపీ నాయకులు ఇప్పటికే కూటమివైపు చూస్తున్నట్టు చెబుతున్నారు. వైసీపీ లో మంత్రి హోదాలు వెలగబెట్టిన వాళ్లు సైతం అదే పనిలో ఉన్నారని సమాచారం. అక్రమాలను కప్పిపుచ్చుకోడానికి కూటమిలోని ఏదోక పార్టీ అండతో బతికేయాలని ప్లాన్ చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. జిల్లాలోని ఓ నాయకుడు జనసేన, మరో నాయకురాలు బీజేపీలోకి దూకడానికి నెమ్మ దిగా పావులు కదుపుతున్నారని పార్టీ వర్గాల్లో వినవస్తోంది. వైసీపీ నాయకులు తొలిగా టీడీపీ లేదంటే జనసేన.. అదీ కాదంటే బీజేపీ వైపు పక్కచూపు చూస్తున్నారు.



కరుణించమ్మా..కోటసత్తెమ్మ

నిడదవోలు, జూన్ 23 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనం కలగజేశారు. ఆదివారం మొత్తం రూ.1,50,405 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.



నేటి నుంచి 26 రైళ్లకు బ్రేక్

5

నెలన్నర పాటు సర్కార్..రత్నాచల్.. జన్మభూమి తదితర రైళ్లు నిలిపివేత

నిన్న కలెక్టర్.. రేపు ఎవరో!



ప్రభుత్వ ఉద్యోగుల్లో టెన్షన్..టెన్షన్

- వైసీపీతో అంటకాగిన అధికారులపై వేటు
- ఇప్పటికే కలెక్టర్ మాధవీలత బదిలీ
- ఆ కోవలోనే మరికొందరు
- రెవెన్యూ, పోలీస్ శాఖలపై దృష్టి
- ఎంపీ, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- సిఫారసులకు తీవ్ర ప్రయత్నాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో జిల్లా అధికారులు.. ఉద్యోగుల్లో బదిలీల భయం పట్టుకుంది. జిల్లాలో ఎక్కువ మంది ఉన్నతాధికారులు కొత్త జిల్లా ఏర్పాటుతో ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఎవరికీ కనీసం మూడేళ్ల సర్వీసు పూర్తి కాలేదు. కానీ తెలుగుదేశం-జనసేన- బీజేపీ కూటమి అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టడంతో పరిపాలన కూడా కొత్తగా ఉండనుంది.ఈ నేపథ్యంలో పాత అధికారులను బదిలీ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలతను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఆమెపై వెల్లువెత్తిన ఆరోపణల నేపథ్యంలో ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీకి రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వులు విడుదల చేశారు.దీంతో వాట్ నెక్ట్స్ అనే మాట వినిపిస్తుంది. ఆ తరువాత ఎవరా అనే లెక్కలు వేసుకుంటున్నారు. వైసీపీతో అంటకాగిన అధికారులు తట్టా బుట్టా సర్దుకునే పనిలోపడ్డారు. ప్రస్తుతం అధికార యంత్రాంగం అంతా ఆందోళనలో మునిగిపోయారు. కలెక్టర్ బదిలీ నేపథ్యంలో ఆదివారం ఎక్కడ చూసినా ఇదే చర్చ సాగడం గమనార్హం. ఒక్కొక్కరి వంతు వస్తుందని, చాలా మంది బదిలీ కావచ్చనే ప్రచారం జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వంతోనూ, వైసీపీ నేతలతోనూ అంటకాగి,వారు చెప్పినట్టు చేసిన అధికారులు, ఉద్యోగులు ఎవరనేది ఇప్పటికే ఆరా తీసినట్టు సమాచారం. ఇష్టానుసారం వ్యవహరించి, నిబంధనలు పాటించని అధికారులకు చుక్కలు చూపించే అవకాశం ఉన్నట్టు సమాచారం. దీంతో ఇక్కడే ఉండడానికి కొందరు, ఇక్కడి వారిని లేపేసి వేరే ప్రాంతాల నుంచి ఇక్కడకు రావడానికి కొందరు ఇప్పటికే ప్రయత్నాలు ఆరంభించారు.

సిఫారసులకు ప్రయత్నాలు..

ఈ నెల 4న టీడీపీ కూటమి విజయం సాధించిన వెంటనే ఆయా అధికారులు, ఉద్యోగులు ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు పేరిట దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎక్కువగా ఎమ్మెల్యేల సిఫారసు లెటర్ల కోసం చూస్తున్నారు.ఎమ్మెల్యేలు కూడా గతంలో తమ పట్ల దురుసుకుగా వ్యవహరించిన అధికారు లెవరూ ఉండకూడదనే అభిప్రాయంతోనే ఉన్నారు. పాలన కొత్తగా ఉండాలని, పక్షపాతం లేకుండా అధికారులు వ్యవ హరించాలన్న ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో కొత్త అధికారులు,ఉద్యోగులైతే ప్రజలకు బాగుంటుందనే అభిప్రా యం వ్యక్తమవుతోంది. కొందరు పాత వారైనా, సమర్ధ వంతంగా, పక్షపాతం లేకుండా పనిచేసేవారుంటే వారిని ఇక్కడే ఉంచాలనే అంచనాలు ఉన్నాయి. అయినా ఎవరి ప్రయత్నాలు వారు మొదలుపెట్టారు. ఎంపీ సిఫారసు లెటర్లకు కొందరు ప్రయత్నిస్తుంటే, జిల్లాలోనే పనిచేయ డానికి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫార్సులెటర్ల కోసం కొందరు ప్రయత్నిస్తున్నారు.

రెవెన్యూ, పోలీసులే టార్గెట్..

తహశీల్దార్లు, సీఐలు ఎక్కువ మంది బదిలీ అయ్యే అవకాశం ఉంది. వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ కుంభకోణాలకు పాల్పడి వైసీపీ నేతలు చెప్పినట్టు చేసిన ఉద్యోగులను ఏరిపారేసే అవకాశం ఉంది. పోలీస్ స్టేషన్లను సెటిల్‌మెంట్ కేంద్రాలుగా మార్చి,కొందరు బ్లాక్‌మెయిర్ల చేత అమాయకులపై కేసులు పెట్టించి, డబ్బు దండుకున్న సీఐల మీద కూడా వేటు పడే అవకాశం ఉంది. తప్పుడు ఫిర్యాదుదార్లను ఏకంగా స్టేషన్లలోపలకే రప్పించుకుని వారితోటే ఫిర్యాదులు చేయించి తప్పుడు కేసులు బనాయించిన సీఐలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. కొందరు కానిస్టేబుళ్ల ఇష్టారాజ్యం ఉంది. డీఎస్పీ స్థాయి అధికారులపైనా ఒక కన్నుంది. ఇక ఇరిగేషన్, మైన్స్ , స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు ,ఉద్యోగులు, వైసీపీ అక్రమాలు, దోపిడీని నిలువరించే ప్రయత్నం చేయలేదని, వారి ఒత్తిళ్లకు భయపడి అక్రమాలను ప్రోత్సహించారనే వాదన ఉంది. ఇసుక , లిక్కర్, సారా అక్రమాలు అరికట్టడం కోసమే ఏర్పడిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కేవలం డబ్బులు దండుకోవడానికి, తప్ప, అక్రమాలు ఆపడానికి ఎక్కడా ప్రయత్నించలేదనే వాదన ఉంది.వీటికి చాలా ఉదాహరణలు చెబుతున్నారు. ఇసుక అక్రమాలపై హైకోర్టు, సుప్రీంకోర్టులే ఆదేశించినా తప్పుడు రిపోర్టుల్లు ఇచ్చారు. ఒక పోలీసు అధికారి ఇసుక కుంభకోణాలపై హైకోర్టును ఆశ్రయించిన ఓ ఫిర్యాదు దారుడిని తన చాంబర్‌లో కూర్చొపెట్టి చుట్టూ పోలీసులు చుట్టుముట్టి ఫొటోలు తీసి తాను చేసిన ఫిర్యాదు తప్పని ఒప్పుకునేలాచేసినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో సదరు ఫిర్యాదుదారు తర్వాత కోర్టులో పిటిషన్ కూడా వేయడం గమనార్హం.ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం కొంత మంది ముఖ్యులపై కూడా వేటు వేయవచ్చనే ప్రచారం ఉంది. ఎవరెవరు వెళతారనే దానిపై ఇప్పటికే అధికారులు ఒక అంచనాకు వచ్చారు.



టమాట.. వినడంలేదు!

బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.100

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 23 : టమోటాల ధర మోత మోగుతోంది. బహిరంగ మార్కెట్లలో కిలో టమోటా ఏకంగా సెంచరీకి చేరువ కావడం ప్రజల్లో ఆందోళన కల్గిస్తోంది. బహిరంగ చిల్లర వ్యాపారులు పావు కిలో రూ.20 నుంచి రూ.25లకు విక్రయిస్తున్నారంటే ధరల దూకుడు ఏ స్థాయిలో ఉందో అర్ధమవుతుంది. ధరలు భారీగా పెరగడంతో రైతు బజార్లలోనూ టమోటాలు దొరకడం గగనంగా మారింది. కొన్ని రైతుబజార్లలో గోళీల్లాంటి టమోటాలను అమ్ముతున్నారు. రాజమహేంద్రవరంలోని రైతు బజార్లలో ఒక మోస్తరు నాణ్యత కల్గిన టమోటాలు కిలో రూ.60ల ధర పలుకుతున్నాయి. ఈ ధర నిలకడగా ఇలానే ఉంటుందా లేక మరింత పెరుగుతుందా అన్నది మార్కెట్ వర్గాలు చెప్పలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం జేసీ తేజ్ భరత్ మార్కెటింగ్, పౌరసరఫరాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ధరల నియంత్రణపై చర్చించినట్టు సమాచారం. మదనపల్లె మార్కెట్ నుంచి టమోటాను ప్రొక్యూర్ చేయాలని అధికారులను ఆదేశించినట్టు సమాచారం. ఈ మేరకు రైతు బజార్ల ఎస్టేట్ ఆఫీసర్ల నుంచి ఇండెంట్ తీసుకున్నట్టు తెలిసింది. జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని హోల్‌సేల్ మార్కెట్లు చిత్తూరు జిల్లా టమోటాలపైనే ఆధారపడతాయి. ప్రస్తుతం అక్కడ తప్ప రాష్ట్రంలో ఎక్కడా టమోటా పంటలేదు. ఆ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు మదనపల్లె మార్కెట్‌కు టమోటాలను తీసుకొస్తుంటారు.అక్కడి నుంచే మన హోల్‌సేల్ వ్యాపారులు టమోటాలను దిగుమతి చేసుకుంటారు.బెంగళూరు టమోటా రాకపోవడం కూడా ధరలపై ప్రభావం చూపుతోంది. మన టమోటా అవసరాలకు ప్రస్తుతం మదనపల్లె మార్కెట్ ఒక్కటే దిక్కు. కావడంతో డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెరుగుతున్నాయి. శనివారం రాజమహేంద్రవరం హోల్‌సేల్ మార్కెట్‌లో 25 కిలోలు ఉండే టమోటా ట్రే రూ.1400లు ధర పలికిందని వ్యాపారులు చెబుతున్నారు. ఈ లెక్కన హోల్‌సేల్‌లోనే కిలో రూ.56లు పడింది.

చుక్ చుక్ బండి... ఇలాగైతే ఎలాగండి!





ప్రజలకు ప్రధాన రవాణా సాధనాలు రైళ్లు. అయితే సుమారు రెండేళ్లుగా రైళ్లు ఎక్కాలంటే జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రయాణంలో నరకం చూస్తున్నారు. ఎందుకంటే ఏ రైలు ఎప్పుడొస్తుందో.. అసలు వస్తుందో రాదో.. ఒకవేళ అదృష్టం బాగుండి వచ్చినా గమ్యానికి ఎప్పుడు చేరుస్తుందో ఎవరూ చెప్పలేని పరిస్థితి. నిర్వహణ పేరుతో దారి మళ్లించ డం, తాత్కాలికంగా రద్దు చేస్తుండడంతో రైలు ప్రయాణం అయోమయంగా మారింది. ఇది చాలదన్నట్టు ఇప్పుడు రాజమండ్రి రైల్వేస్టేషను గుండా నడుస్తూ.. ప్రజాదరణ ఎక్కువగా కలిగిన 26 రైళ్లను ఏకంగా నెలన్నరపాటు రద్దు చేశారు.

- ఇప్పటికే ఉసూరుమంటున్న ప్రయాణికులు
- నేటి నుంచి ఏకంగా 26 రైళ్లు రద్దు
- నిర్వహణ పేరుతో నెలన్నర బంద్
- సుదూరాల నుంచి వచ్చే రైళ్లే దిక్కు
- వాటిలో కాలు పెట్టలేని దుస్థితి
- ఇంటర్ సిటీలు వేయాలని డిమాండ్
- కొత్త ఎంపీ పట్టించుకోవాలని అభ్యర్థన

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తూర్పు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, ఏఎస్ఆర్ జిల్లా ప్రయాణికుల కు అగచాట్లే.. ముఖ్యంగా చెన్నై, హైదరాబాద్, బెంగళూరుకు రాకపోకలు సాగించే వాళ్లకు మరిన్ని తిప్పలు తప్పకపోవచ్చు. సింహాద్రి రైలును తాత్కాలికంగా రద్దు చేస్తేనే జనాలు అల్లాడిపోతారు. అలాంటి పరిస్థితుల్లో రత్నాచల్, సర్కారు, జన్మభూమి, లింక్, తిరుపతి-కాకినాడ బళ్లను ఆపేయడంవల్ల ప్రయాణికుల ఇబ్బందులు తారాస్థాయికి చేరే అవకాశం ఉంది. కారణాలేమైనా ప్రత్యామ్నాయంగా ఇంటర్ సిటీలునడపాలనే డిమాండ్ వినవస్తోంది. తమ అవస్థలపై కొత్తగా ఎన్నుకున్న ఎంపీ పురందేశ్వరి దృష్టి సారించాలని గోదా రోళ్లు కోరుతున్నారు. ఏదేమైనా రైళ్లు గాడి తప్పడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

చుక్‌చుక్ బండి ఎందుకిలా..

2023 జూన్ 2వ తేదీ రైల్వే చరిత్రలోనే దారుణమైన దుర్ఘటన. ఒడిషాలోని బాలాసోర్ వద్ద కోరమాండల్ మరో రెండు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో 300 మందికిపైగా బలైపోయారు. దీంతో రైల్వే ఉలిక్కిపడింది. అత్యున్నత స్థాయిలో సమావేశాలు జరిగాయి. భద్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని.. ట్రాక్, సిగ్నల్స్ వంటి కీలకమైన విభాగాలకు నిర్వహణ (మెయింటెనెన్స్)కు తగు సమయం కేటాయించాలని నిర్ణయించారు. ఆ మేరకు పనులు ఆరంభించారు. వీటి కోసం రోలింగ్ బ్లాక్ కారిడార్ పేరుతో రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడం, దారి మళ్లించడం చేస్తున్నారు. నాటి నుంచి మెయింటెనెన్స్ అని బ్లాక్(ఆ ట్రాక్‌పై రైళ్లను రద్దు చేయడం) తీసుకొంటున్నారు. కానీ పనులు వేగంగా చేయడం లేదనే విమర్శలున్నాయి. దీంతో రైళ్ల రాకపోకల్లో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. ఉదాహరణకు రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫాం ట్రాక్‌కి మరమ్మతులు పూర్తిచేశారు. ప్లాట్‌ఫాం మరమ్మతులు పూర్తి చేయడంలో జాప్యం జరుగుతోంది. దీంతో ట్రాక్ సిద్ధమైనా ప్రయాణికుల రైళ్లను నడపలేని పరిస్థితి నెలకొంది.

అసలే అంతంత మాత్రం..

రాజమండ్రి రైల్వే స్టేషను ద్వారా ప్రతి రోజూ 10 వేల మంది వరకూ ప్రయాణాలు సాగిస్తున్నారు. వీరిలో ఉభయగోదావరి జిల్లాలకు చెందిన ప్రజలు ఉంటారు. ప్రయాణికులు ఎక్కువగా రాకపోకలు సాగించే రైళ్లతో పాటు మొత్తం 26 రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు. కడియం-నిడదవోలు మధ్య పూర్తిస్థాయిలో మరమ్మతులంటూ కారణంగా చూపుతున్నారు. అయితే రద్దు చేసే బదులు ఆయా స్టేషన్లను మినహాయించి నడిపే ఆలోచన చేశారో లేదో అనేది ప్రశ్నగానే మిగిలిపోతోంది. ఇప్పటికే బెంగళూరు వెళ్లే వారికి ఇటు నుంచి అటు నుంచి సరైన రైళ్లు లేవు. హతియా-హౌరా-న్యూతిన్సూకియా, టాటా, భువనేశ్వర్ నుంచి ఉన్నాయి. అమృత్ భారత్ సోమవారం ఇటు నుంచి మంగళవారం అటు నుంచి ఉంది. కాకినాడ నుంచి బెంగళూరుకు ఉన్న శేషాద్రి మాత్రమే ఈ ప్రాంతం వాళ్లకు దిక్కు. భువనేశ్వర్ నుంచి వచ్చే హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ బుధవారం రాజమ హేంద్రవరం వస్తోంది. ఈ రైలుకి 20 రోజులు ముందు టికెట్ చేయించుకుంటే రూ.2 వేలు అవుతుంది. ముజఫర్‌పూర్, న్యూతిన్సూకియా, భువనేశ్వర్ నుంచి వారానికి ఒకసారి, గువాహటి నుంచి వారానికి మూడుసార్లు రైళ్లు ఉన్నా బోగీల్లో కాలు పెట్టడానికి వీలుండదు. జన్ సాధారణ్ రైళ్లు ఉన్నాయని రైల్వే చెబుతున్నా అవి గువాహటి, హౌరా వంటి సుదూర ప్రాంతాల నుంచి ఉండడంతో అక్కడ బోగీలు నిండిపోతాయి. ఈ ప్రాంతం వాళ్లకు వాటితో ఎలాంటి ఉపయోగమూ లేదు. చెన్నైకి టాటా, ధన్‌బాద్, పురూలియా, న్యూతిన్సూకియా, షాలిమార్(కోరమాండల్), హౌరా, భువనేశ్వర్ నుంచి ఉన్నాయి. హౌరా-కన్యాకుమారి, భువనేశ్వర్-పుదుచ్చేరి, ముజఫర్ పూర్-జోలార్‌పెట్టై వరకూ వారానికి ఒకసారి, సిల్చార్-కోయంబత్తూరు, భువనేశ్వర్-చెన్నై, జసిద్-తాంబరం(గురు), ఖరగ్‌పూర్- విల్లుపురం, భువనేశ్వ ర్-రామేశ్వరం, విశాఖ-చెన్నై (శుక్ర), హౌరా-తిరుచిరా పల్లి(సోమ,శుక్ర) గువాహటి నుంచి మూడురోజులు జోలార్‌పేట్ వరకూ, షాలిమార్- త్రివే ండ్రం (మంగళ, బుధ) ఉన్నాయి. సంత్రాగచి-చెన్నై ఏసీ ఎక్స్‌ప్రెస్ బుధ, శనివారాల్లో నడుస్తోంది. వీటిలో బెర్తులు దొరకాలంటే అదృష్టాన్ని నమ్ముకోవాల్సిందే. హైదరాబాద్‌కి వందే భారత్(ఆదివారం మినహా) వేసినా దానికి సమయపాలన ఇంకా అలవాటు పడలేదు. పైగా చైర్‌కార్ రూ.1425, ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ రూ.2535 ధరలు ఉండడంతో సామాన్యుడు ఎక్క లేని పరిస్థితి ఉంది. మరో వందే భారత్(గురువారం మినహా) నడుస్తోంది. భువనేశ్వర్, హౌరా, షాలిమార్ నుంచి వచ్చే రైళ్లలో అడుగు పెట్టడానికి వీలుండదు. ఇప్పుడు జన్మభూమి, కోకనాడను తాత్కాలింకగా రద్దు చేయడంతో గౌతమి, గోదావరిపై మరింత ప్రయాణికుల భారం పడనుంది.

రద్దు చేసిన రైళ్లు ఇవే..

ఈనెల 24 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకూ 26 రైళ్లను రానుపోను తాత్కాలికంగా నిలిపివేశారు. రైలు నెం.07466, 07467 (రాజమండ్రి-విశాఖ మెము), 17257, 17258 (కాకినాడ-విజయవాడ మెము), 17219, 17220 (మచిలీపట్నం-విశాఖ), 17249, 17250 (తిరుపతి-కాకినాడ), 17239, 17240(సింహాద్రి), 17243, 17244(రాయగడ), 12861, 12862(లింక్ దక్షిణ్), 12717, 12718(రత్నాచల్), 12805, 12806(జన్మభూమి), 17643, 17644(సర్కారు), 22701, 22702(ఉదయ్), 12775, 12776(కోకనాడ), 22707, 22708(విశాఖ-తిరుపతి డబుల్ డెకర్) రైళ్లు 47 రోజుల పాటు రాకపోకలు సాగించవు. ఈ మేరకు ఫిబ్రవరి 19వ తేదీనే ఆదేశాలు జారీ అయ్యాయి. టీసీఐ, టీఎఫ్‌టీఆర్, పీక్యూఆర్ఎస్ పనుల కోసం రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గంట ఆలస్యంగా గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు



సామర్లకోట, జూన్23: కాకినాడ నుంచి లింగంపల్లి వెళ్లే గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారంరాత్రి గంట ఆలస్యంగా కాకినాడనుంచి బయలుదేరి సామర్లకోటకు చేరుకుంది. లింగంపల్లి నుంచి కాకినాడ వచ్చే గౌతమి ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం సుమారు 270 నిమిషాలు ఆలస్యంగా సామర్లకోటచేరుకుని కాకినాడపోర్టుకు చేరుకుంది. సాధారణ నిర్వహణలో భాగంగా గంట ఆలస్యంగా తిరిగి లింగంపల్లికి బయలుదేరింది. దీంతో నిర్దేశిత సమయం రాత్రి 7.10 నిమిషాలకు కాకినాడ నుంచి బయలుదేరాల్సి ఉన్నప్పటికీ గంట ఆలస్యంగా రాత్రి 8.10కు బయలుదేరింది. విజయ వాడ రైల్వే సెక్షన్‌లో వివిధ అభి వృద్ధి పనులలో భాగంగా గౌతమి రైలు రీషెడ్యూల్ చేయాల్సివచ్చి నట్లు రైల్వే సీపీటీఎం (విజయవాడ) అధికారి ఆదివారం రాత్రి తెలిపారు. దీంతో సామర్లకోట తదితర రైల్వే స్టేషన్లలో వివిధ ప్రాంతాల కు వెళ్లే ప్రయాణికులకు ముందస్తు సమాచారం లేకపోవ డంతో గంటసేపు రైల్వేస్టేషన్లో ఎదురుచూపులు చూడాల్సి వచ్చింది.

భగవంతుని ఆరాధనతోనే

మానసిక ప్రశాంతత

'మహా సహస్రావధాని' డాక్టర్ గరికపాటి నరసింహారావు


ప్రవచనాలు ఇస్తున్న డాక్టర్ గరికపాటి

మండపేట, జూన్ 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేటలోని ధర్మగుండం చెరువువద్ద ఉన్న రామాలయం కమిటీ సారధ్యంలో సీతారామ కల్యాణ మండపంలో 'మహా సహస్రావధాని' డాక్టర్ గరికపాటి నరసింహారావు మూడురోజుల ప్రవచనాలు ఆదివారంతో ముగిశాయి. భగవంతుని ఆరాధనతోనే మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. జీవుల పట్ల మానవత, దయా హృదయం కలిగి ఉండాలని కోరారు. సమాజంలో కులతత్వం పోవాలన్నారు. అందరూ సమానమేనన్న భావన ప్రతిఒక్కరిలోనూ రావాలన్నారు. నేటి సమాజంలో జరుగు తున్న వాస్తవాలను గరికపాటి తనదైనశైలిలో వివరించారు. రాష్ట్రంలో పాలన, ప్రజల ఇబ్బం దులను ఆయన వివరించిన తీరు ఆకట్టుకుంది. ఎందరో మహనీయులు, భగవత్ స్వరూపులు వున్న జిల్లా ఉమ్మడి తూర్పుగోదావరి అన్నారు. జిల్లాలోని శివాలయాల ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి ఆలయ విశిష్టత, శివతత్వం, గోమాత విశిష్టతలను తెలియజెప్పారు. ఆవు గడ్డి తిని పాలు ఇస్తుంటే ప్రభుత్వ ఉద్యోగి మాత్రం లంచం అంటూ అంటకాగుతున్నాడని, ఆ విధానం మానుకోవాలని పిలుపునిచ్చారు. మానవసేవే మాధవసేవగా సమాజంలో అందరూ మానవ సేవ ద్వారా దైవసేవ చేసి వారి ఆశీస్సులు పొందిననాడే వారికి పుణ్యఫలాలు దక్కుతాయన్నారు. దేవాలయాలకు వెళ్లినప్పుడు భక్తులు కోరికలు కోరకుండా భగవంతుడు ఇచ్చిన వాటినే స్వీకరించాలన్నారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మంచి పాలన అందించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారధ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మాండవ్యపురం విశిష్టతను కూడా వివరించారు. మాండవ్యముని గురించి, డొక్కా సీతమ్మ గురించి ప్రసంగిం చారు. అనంతరం గరికపాటిని కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. వేద పండితులు వేదాశీర్వచనాలు అందించారు. మూడు రోజులపాటు జరిగిన ప్రవచనాల్లో నిర్వాహకులు ఇనపకోళ్ల అబ్బు, వల్లూరి నల్లబ్బు, విజ్ఞాన్ రాంబాబు, పలువురు సభ్యులు, పట్టణ ప్రముఖులు, అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సత్యదేవుడిని దర్శించుకున్న పాతపట్నం ఎమ్మెల్యే


ఎమ్మెల్యే గోవిందరావుకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న పీఆర్వో

అన్నవరం, జూన్ 23: సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఎమ్మెల్యేగా కూటమి తరుపున పోటీచేసి గెలుపొందిన మామిడి గోవిందరావు స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు.

పాదగయలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే పూజలు


పాదగయ క్షేత్రంలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్

పిఠాపురం, జూన్ 23: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆదివారం సాయంత్రం సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పుర్హూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం గురించి వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట పాదగయ మాజీ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, బీజేపీ నాయకుడు పెండెం సత్యనారాయణ, ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

డయేరియాని ఎదుర్కోండి


బెండపూడిలో మూసివేసిన బావిని పరిశీలిస్తున్న డైరెక్టర్ పద్మావతి

- వ్యాధిని గుర్తించిన వెంటనే పీహెచ్‌సీకి తరలించాలి
- ప్రతిరోజు తాగునీటి శాంపిళ్లు సేకరించాలి
- నిరంతర ఇంటింటి సర్వే చేయాలి
- ఏపీ హెల్త్ డైరెక్టర్ పద్మావతి

తొండంగి, జూన్ 23: గ్రామస్థాయిలో అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి డయేరియా వ్యాధిని పూర్తిగా ఎదుర్కోవాలని ఆంధ్రప్రదేశ్ హెల్త్ డైరెక్టర్ పద్మావతి తెలిపారు. ఆదివారం ఆమె కొమ్మనాపల్లి, బెండపూడి గ్రామాల్లో పర్యటించి సిబ్బందితో సమావేశమయ్యారు. కొమ్మనాపల్లిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో డయేరియా ఇతర వ్యాధులు ప్రబలుతున్నందున ఆరోగ్య సిబ్బంది అప్రమత్తం కావాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ ఆర్‌డబ్ల్యుఎస్,తదితర శాఖల సిబ్బందితో కలిసి ఆరోగ్య సిబ్బంది గ్రామస్థాయిలో కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతిరోజు తాగునీటి వనరుల ప్రారంభస్థాయి, మధ్య, ముగింపు స్థాయిలవద్ద శాంపిళ్లు సేకరించి పరీక్షలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఆశ,హెల్త్ వర్కర్లు ఇంటింటి సర్వే చేయాలన్నారు. ఎవరైనా ఏదైనా రోగానికి గురైతే పీహెచ్‌సీకి తీసుకువెళ్లి అప్పగించాలన్నారు. తాగునీటి వనరులు కలుషితం కారణంగా రోగాలు వ్యాప్తి చెందుతున్నందున పంచాయతీ సిబ్బందితో కలిసి పైప్‌లైన్ లీకేజీ, క్లోరినేషన్ వంటి కార్యక్రమాలు పర్యవేక్షించాలన్నారు. డయేరియా వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చేంత వరకూ శిబిరాలను కొనసాగించాలన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో ప్రస్తుత పరిస్థితిని వైద్యులు రవికుమార్, భారతిలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్ కోన సూర్యనారాయణ అమ్మాజీని పంచాయతీ పరంగా తీసుకున్న చర్యల గురించి అడిగి పలు సూచనలు చేశారు. రీజనల్ డైరెక్టర్ పద్మ శశిధర్, డీఎంహెచ్‌వో నర్సింహనాయక్, అదనపు డీఎంహెచ్‌వో రమేష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె బెండపూడిగ్రామంలో పర్యటించి సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామంలో మూసివేసిన బావిని పరిశీలించి పలు సూచనలు చేశారు.

స్టాప్ డయేరియాని విజయవంతం చేయాలి

సమీకృత డయేరియా నియంత్రణ (స్టాప్ డయేరియా) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హెల్త్ డైరెక్టర్ పద్మావతి తెలిపారు. బెండపూడిలో ఆమె మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకూ రెండు నెలల పాటు కార్యక్రమం అమలు జరుగుతుందన్నారు. ఐదు సంవత్సరాలలోపు వయస్సున్న పిల్లల్లో డయేరియా వ్యాధి నివారణకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఆశ వర్కర్లు ఆరోగ్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కలిగించాలన్నారు. జూలై 18 నుంచి ప్రారంభమై 31 వరకూ జరిగే లెప్రసీ సర్వేను కూడా గ్రామస్థాయిలో విజయవంతం చేయాలన్నారు,

త్వరలోనే పిఠాపురంలో పవన్ పర్యటన

- తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం
- జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు


ఇల్లింద్రాడ వద్ద కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతున్న నాగబాబు

పిఠాపురం, జూన్ 23: జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మూడు, నాలుగు రోజుల్లో పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారని జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు తెలిపారు. పిఠాపురం పట్టణ శివారు ఇల్లింద్రాడ వద్ద గల రైసుమిల్లులో ఆదివారం సాయంత్రం ఆయన జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. గొల్లపల్లి పెదబాబీ ఆధ్వర్యంలో జనసేన నేతలు నాగబాబును ఘనంగా సత్కరించారు. తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలను కలుసుకోవాలనే ఆత్రుతతో పవన్ ఉన్నారని తెలిపారు. ఉపముఖ్యమంత్రిగా, ఐదుశాఖల బాధ్యతలు అయనపై ఉన్నాయని, వాటికి న్యాయం చేస్తూనే నియోజకవర్గంలో పర్యటిస్తారని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని పవన్ నెరవేరుస్తారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజల ఆకాంక్షలను నూరుశాతం ఆయన నెరవేరుస్తారని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గానికి ఏదొకటి చేసిన తర్వాతే గెలుపు సంబరాలు చేసుకోవాలన్న ఆలోచనలో పవన్ ఉన్నారని చెప్పారు. పవన్‌ను మీ ఇంటి వ్యక్తిగా స్వీకరించాలని ఆయన పిఠాపురం ప్రజలను కోరారు. నియోజకవర్గ పరిధిలో జరిగే అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలని, గంజాయి బ్లేడ్‌బ్యాచ్‌లు కనిపిస్తే పోలీసుస్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. ఎన్నికల ముందు కొంతమంది వైసీపీ నాయకులను తీసుకున్నామని, ప్రజలకు ఉపయోగపడే వారు వచ్చి చేరతామంటే ఆలోచిస్తామని తెలిపారు. చాలామంది వైసీపీ కార్యకర్తలు గత ఎన్నికల్లో జనసేనకు పరోక్షంగా సహకరించారని చెప్పారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారు పార్టీలో చేరతామంటే మాత్రం రెడ్‌మార్క్ వేసి ఆపివేస్తామని తెలిపారు. ఎవరు పార్టీలో చేరినా తొలిప్రాధాన్యం మాత్రం జనసేన, టీడీపీ కార్యకర్తలకే ఉంటుందని స్పష్టం చేశారు. మనకు తెలుగుదేశంతో ఎటువంటి విభేదాలు లేవని తేల్చి చెప్పారు. ప్రజల కోసం పవన్ ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు, పలువురు జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు. కాగా గొల్లప్రోలు సొసైటీ ద్వారా రుణాలు తీసుకుని పంటలు నష్టపోయిన రైతులకు 2019-20లో పంటల భీమా పరిహారం ఇప్పటివరకూ అందలేదని, నాలుగు శాతం వడ్డీ రాయితీ సక్రమంగా అందడం లేదని సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల ఏసువెంకటరమణ నాగబాబు దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రం అందజేశారు.

నేడు కుమార రామ భీమేశ్వరుడికి అభిషేకాలు



సామర్లకోట, జూన్ 23: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరా లయంలో శివలింగానికి భారతీయ పురావస్తుశాఖ ఉన్నతాధికారుల అనుమతుల మేరకు నేడు సోమవారం నుంచి అభిషేక పూజలు పునరుద్ధరించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం చెప్పారు. గత సోమవారం నుంచి మూలవిరాట్‌కు పూజలు, దర్శనాలకు అనుమతులు ఇచ్చినప్పటికీ శివలింగానికి అభిషేక పూజలకు మాత్రం అనుమతులు లభించలేదు. అధిక సంఖ్యలో భక్తుల విజ్ఞాపనల మేరకు భారతీయ పురావస్తుశాఖ ఉన్నతాధికారులు అభిషేక పూజలకు సోమవారం నుంచి అనుమతులు మంజూరు చేశారు. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ ఈవో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రీజెన్సీ విధ్వంసం కేసులో

ఇద్దరు అధికారులకు జైలు

యానాం, జూన్ 23: యానాంలో సంచలనం కలిగించిన రీజెన్సీ సంఘటనకు సంబంధించి కేసుల్లో ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులకు కోర్టు జైలుశిక్ష విధించింది. 2012లో జరిగిన ఈ సంఘటనలో యూనియన్ నాయకుడు మృతి, యాజమాన్యానికి చెందిన ప్రతినిధి హత్య, పరిశ్రమ ధ్వంసానికి సంబంధించి పలు కేసులు నమోదయ్యాయి. అనంతరం సీబీఐ విచారణ జరిగింది. పరిశ్రమను తగులబెట్టిన ఘటన, పోలీస్‌స్టేషన్‌లో కార్మిక నాయకుడు మృతి కేసుల్లో ఇద్దరు పోలీసు అధికారులకు పుదుచ్చేరి సీజేఎం కోర్టు రెండేళ్ల జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ కేసులో అప్పటి సీఐ పెరియస్వామి (ప్రస్తుతం ఉద్యోగ విరమణచేశారు), ప్రస్తుతం పుదుచ్చేరిలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వీరభద్రస్వామి ఉన్నారు. ఈ సంఘటన యానాంలో మాయని మచ్చగా మిగిలిపోయింది. ప్రస్తుతం పరిశ్రమ పునఃప్రారంభిస్తున్న నేపథ్యంలో ఈ తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది. మిగిలిన కేసుల్లో తీర్పు ఏమిటనేది తీవ్ర చర్చకు దారితీస్తోంది.

పిల్లలతో తల్లి గోదావరిలో దూకే యత్నం

- ప్రాణాలను కాపాడిన పోలీసులు


బాధితురాలితో మాట్లాడుతున్న పోలీసులు

ఐ.పోలవరం, జూన్ 23: కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక తల్లి ఇద్దరు పిల్లలతో గోదావరిలో దూకేందుకు ప్రయత్నించగా సమాచారం అందుకున్న ఐ.పోలవరం పోలీసులు సమయస్ఫూర్తితో వారిని రక్షించారు. కాకినాడకు చెందిన చింతలపూడి గీతాంజలి భర్తపై కోపంతో తన ఇ ద్దరు పిల్లలతో కలిసి శనివారం రాత్రి బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఐపోలవరం మండలం ఎదురులంక బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకేందుకు ప్రయత్నిస్తుండగా అటు గా వెళ్తున్న ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణ, కానిస్టేబుల్ విజయకుమార్ వెంటనే వచ్చి వారి ప్రాణాలను రక్షించారు. కుటుంబ సభ్యులకు వారిని అప్పగించారు. పోలీసుల సమయస్ఫూర్తిని ప్రజలు ప్రశంసించారు.

'లోవ'లో భక్తుల సందడి


ఆలయ ప్రాంగణంలో భక్తులు రద్దీ

తుని రూరల్, జూన్ 23: ప్రసిద్ధిపుణ్యక్షేత్రంలో లోవదేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులతో ఆలయానికి రావడంతో భక్తులతో కిక్కిరిసింది. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అమ్మవారికి దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని ఆలయప్రాంగణంలో గల ఆరుబయట మామిడితోటల్లో, వసతి గృహాల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజు భక్తుల ద్వారా వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.4.92లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాద్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజా ఆకాంక్షల మేరకు నూతన ప్రభుత్వ పాలన

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్, చిత్రంలో సిటీ ఎమ్మెల్యే కొండబాబు తదితరులు

కాకినాడసిటీ, జూన్ 23: రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ప్రజా ఆకాంక్ష మేరకు సక్రమ మైన పరిపాలన అందిస్తోందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆది వారం తొలిసారిగా కాకినాడకు విచ్చేసిన మంత్రి సుభాష్ స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను గాలికి వదిలేయడంతో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. నవరత్నాలు పథకాలను ఊదరకొడుతూ 175 సీట్లు వస్తాయని జగన్మోహన్‌రెడ్డి కలలు కన్నారన్నారు. 2014నుంచి 2019 వరకు చంద్రబాబు పాలనలో చంద్రన్న బీమా పథకం ద్వారా 2 కోట్ల 16 లక్షల మంది లబ్ధి పొందారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం కోటి 25 లక్షల మందికి మాత్రమే సాయం అందించారన్నారు. అదే విధంగా ఎస్సీ, బీసీ, ఎస్టీ కార్పొరేషన్‌లను వైసీపీ నిర్వీర్యం చేసిందన్నారు. ఇవన్నీ గమనించిన ప్రజలు రాష్ట్రంలో కూటమికి భారీ మెజారిటీతో అధికారం కట్టబెట్టారన్నారు. గెలిచిన ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా పని చేయా లని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఇసుక దోపి డీ చేశారని, సామాన్య ప్రజలకు ఇసుక దొరక్కపోవడంవల్ల ఆ ప్రభావం భవననిర్మాణ కార్మికులపై పడిందన్నారు. ఇసుకకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలసీని తీసుకురానుందన్నారు. దీని వల్ల భవన నిర్మాణ కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వ స్థలాల్లో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అంతేతప్ప కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలు ఉండవన్నారు. కార్మికులకు చెందాల్సిన రూ.3 వేల కోట్లు వైసీపీ ప్రభుత్వంలో దారి మళ్లించారన్నారు. లిక్కర్, ఇసుక దోపిడీతో రాష్ట్రాన్ని లూటీ చేశారని మంత్రి సుభాష్ మండిపడ్డారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ టీడీపీ ఎజెండాలో పొందుపరిచిన మూడు గుర్తులు గృహం, చక్రం, నాగలి పేద బడుగువర్గాల శ్రేయస్సును చాటుతున్నాయన్నారు. ఈ గుర్తులు కార్మికుల ప్రాధాన్యతను, రైతుల ప్రాధాన్యతను, గృహ నిర్మాణం ప్రాధాన్యతను తేటతెల్లం చేస్తున్నాయన్నారు. కార్మికుల శ్రేయస్సు కోసం టీడీపీ ప్రభుత్వం ఎంతో పాటుపడిందన్నారు. అటువంటి ముఖ్యమైన కార్మికశాఖ మంత్రి బాధ్యతను సుభాష్‌కు అప్పగించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో కార్మికుల సమస్యలను మంత్రి పరిష్కారానికి కృషి చేయనున్నారన్నారు. అదేవిధంగా చంద్రన్న బీమా అందరికీ అందేలా దృష్టి సారించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికులకు అండగా ఉండి కార్మికుడు బాగుపడేలా ఈ ప్రభుత్వం ముందుకు పయనిస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర టీడీపీ ఆరోగ్య విభాగం సభ్యు డు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు పప్పు దుర్గారమేష్, సుందరపల్లి గోపాలకృష్ణ, అనసూరి సతీష్, కొలిక్కిగడ్డ గంగరాజు, తెల్లగ్రాపు లక్ష్మీగణేష్, జొన్నాడ వెంకటరమణ, చోడిపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

పెద్దిరెడ్డి పేషీతో 'షెకావత్' లింకులు

● ఆ అండతోనే అన్ని విభాగాల్లోనూ అక్రమాలు

(ఆంధ్రజ్యోతి-అమరావతి)

మారేడుమిల్లి అడవుల్ని అడ్డాగా చేసుకుని టేకు దొంగలకు రాజబాట వేసి అటవీ వినాశనానికి అండగా నిలిచి, అన్నింటా ఆగడాలు, దందా సాగించిన అటవీ ఉన్నతాధికారికి ఏకంగా అప్పటి అటవీ మంత్రి పేషీతోనే లింకులున్నాయి. ఆ అండతోనే టేకు ప్లాంటేషన్లలో వందలాదిగా చెట్లను నరికేసి అక్రమంగా తరలిపోయినా, ఆయన పరిధిలో ఎక్కడ అవకాశం ఉన్నా అక్కడ అక్రమాలు సాగించేయడం ఆయన హయాంలో ప్రహసనంగా సాగింది. గిరిజన రైతుల పట్టా భూముల్లోని టేకు చెట్లకు అనుమతులు, ఎకో టూరిజం ప్రాజెక్టుల నిర్వహణ, అడవిలో రోడ్ల నిర్మాణాలకు అడ్డగోలు అనుమతులు ఇలా అవకాశం ఉన్న ప్రతి వ్యవహారంలోనూ ఆయన, ఆయన బృందం సాగించిన అక్రమాలు కోకొల్లలు.

అల్లూరి జిల్లా రంపచోడవరం అటవీ డివిజన్లో గత ప్రభుత్వ తీరుకు అనుగుణంగా పలు అక్రమాలు జరిగాయి. గిరిజనులు పోడు వ్యవసాయం సాగిస్తే తీవ్ర నేరంగా పరిగణించే వ్యవస్థలో అటవీ కార్యక్రమాల ముసుగులో అక్రమాలకు తెరలేపేశారు. ముఖ్యంగా వచ్చేది ఎలాగూ తమ ప్రభుత్వమే అనుకున్నారో ఏమోగానీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే అన్నీ చక్కబెట్టేశారు. గిరిజన రైతుల పట్టా భూములలో ఉండే టేకుచెట్ల నరికివేత, వాటి రవాణాకు సంబంధించిన ఫైళ్ల నిర్వహణతో సదరు అధికారి కార్యాలయం రచ్చకెక్కింది. దీంతో ఓ బాధితుడి ఫిర్యాదుతో ఆయన టార్గెట్‌గా ఏసీబీ అధికారులు దాడి చేయగా ఆ కార్యాలయంలోని ఓ రేంజ్ అధికారి దొరికిపోయారు. తర్వాత క్రమంలో మారేడుమిల్లి రేంజ్ పరిధిలోని టేకు ప్లాంటేషన్లలోని సుమారుగా 378 టేకు చెట్ల నరికివేత రాష్ట్రంలోనే సంచలనంగా మారి వరుసగా మీడియాలో షెకావత్ లీలలన్నీ వెలుగు చూశాయి. ఈ బాగోతాలన్నిటిపైనా పీసీసీఎఫ్ కార్యాలయం విచారణకు ఆదేశిస్తే శాఖలో షెకావత్‌కు నచ్చిన అధికారులనే విచారణాధికారులుగా నియమించారు. దీంతో విచారణను మొక్కుబడిగా సాగించి నరికివేయబడిన చెట్ల లెక్కలను మాత్రం తేల్చి, దిగువ స్థాయి అధికారులపై చర్యలు తీసుకుని వదిలేశారన్న విమర్శలు శాఖలోనే వినిపిస్తున్నాయి. ఎక్కడైనా అక్రమాలు జరిగితే ఆరోపణలను ఎదుర్కొంటున్న అధికారులను అక్కడి నుంచి తప్పించి విచారణ జరపడం రివాజు. కానీ ఇక్కడ మాత్రం సదరు అధికారి కనుసన్నలలోనే విచారణ జరిపిన పరిస్థితులు నెలకొన్నాయి. అక్రమ టేకు చెట్ల నరికివేత వ్యవహారంలో పోలీసు ఫిర్యాదుచేసి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి దర్యాప్తు సాగించాలని ఇచ్చిన ఆదేశాలు కూడా గాలికొదిలేశారు. ఈ టేకు చెట్ల వ్యవహారం సాగుతుండగానే మారేడుమిల్లి రేంజ్ పరిధిలో నడుస్తున్న ఎకో టూరిజం ప్రాజెక్టులలో కూడా అనేక అక్రమాలు వెలుగు చూశాయి. కమిటీలు లేకుండానే కార్యకలాపాలు సాగించడం, నిధులను డ్రా చేయడం, నిబంధనలకు విరుద్ధంగా వాటి నిధులను తమ నివాసాల కోసం వెచ్చించడం వంటి బాగోతాలపై విచారణ సాగుతున్నా అది కూడా ఆయన కనుసన్నలలోనే సాగుతోందన్న విమర్శలూ ఉన్నాయి. కాగా కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం మారడంతో పర్యావరణాన్ని కాంక్షించే కొందరు ఈ వ్యవహారాలపై ధైర్యంగా ముందుకు వచ్చారు. గతంలో టేకు చెట్ల నరికివేత వ్యవహారంలో విచారణ నిర్వహించిన అధికారులకే ఎకో టూరిజం విచారణ అప్పగించడంపై కొందరు నేరుగా సీసీఎఫ్‌ను కలిసి కొందరు డీఎఫ్‌వోల వల్ల విచారణ పక్కదారి పడుతోందని, వారిని తప్పించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించడంతో ఇద్దరు డీఎఫ్‌వోలను తప్పించి ఎకో టూరిజం విజిలెన్స్ డీఎఫ్‌వో ఒకరికి అప్పగించారు. ప్రస్తుతం ఆయన ఈ విచారణను సాగిస్తుండగా ఆయనపై కూడా సదరు అధికారి ప్రభావం చూపాలని ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోయింది. ఇదిలాఉండగా అటవీ ప్రాంతం మీదుగా వెళ్లే అనే క రోడ్ల నిర్మాణాలకు కూడా ఆయా కాంట్రాక్టర్ల ప్రయోజనం కోసం అడ్డగోలు అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలూ ఉన్నాయి. వై.రామవరం మండలంలో తాడికొండ అటవీ ప్రాంతంలో వైసీపీ అండతో ఓ వ్యక్తి పెద్ద ఎత్తున అటవీ వినాశనానికి పాల్పడి తన భూముల కోసం రహదారి నిర్మిస్తే మొక్కుబడి చర్యలతో ప్రోత్సహించారు. స్థానిక వైసీపి ఎమ్మెల్సీ, ఇతర కేంద్ర సర్వీసుల అధికారుల అండతో పాటు అటవీ మంత్రి పేషీతో ఉన్న లింకులతో ఈయనకు ఎదురు నిలిచేవారే లేకుండా పోయారు. ఇక్కడ బాగోతాల వాస్తవాలను నివేదించిన ఓ అధికారి నివేదించిన తీరు ఉన్నతాధికారులకు తెలిసినా స్పందించలేదు. కాగా తీవ్రత లేకుండా ఓ నివేదికను ప్రభుత్వానికి పంపించగా ఎలాగూ వచ్చేది తమ ప్రభుత్వమే అన్న ధీమా తో ఎన్నికలు దాటాకా దాని సంగతి చూసుకుందామనుకుంటే రాష్ట్రంలో పాలనా పగ్గాలే మారిపోయాయి. అందునా అటవీశాఖ బాధ్యతలు పవన్‌కల్యాణ్ తీసుకోవడంతో వైసీపీ నాయకులతో అంటకాగిన ఇక్కడి అక్రమాల అధికార బృందానికి చెమటలు పడుతున్నాయి. ముఖ్యంగా ఎవర్ని నమ్మి ఇంతకాలం యథేచ్ఛగా అక్రమాలను కొనసాగించారో ఆయా ఉన్నతాధికారులు సైతం చేతులెత్తేశారు. తనకు అండగా నిలిచే వారి పరిస్థితులే ప్రతికూలంగా మారిన సందర్భం షెకావత్ బృందాన్ని షేక్ చేస్తోంది. ఏం జరుగుతుందో ఇక చూడాలి మరి.

కోడిపందేల స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దేవీపట్నం, జూన్23: మండలంలోని కొండమొదలు ఆర్అండ్ఆర్‌కాలనీలో ఈనెల 20వ తేదీన భారీ ఎత్తున జరిగిన కోడిపందేల వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించడం జరిగింది. ఈకథనానికి స్పందించిన పోలీసు అధికారులు దేవీపట్నం మండలంలోని పందేలు నిర్వహించిన స్థలాన్ని పరిశీలించారు.

పాపికొండలకు వెళ్లిన పర్యాటక బోట్లు

దేవీపట్నం, జూన్ 23: పాపికొండలు అందాలు తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు ఆదివారం విహారయాత్రకు వచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి గోదావరి పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, గుర్తేడు, కొండమొదలు మీదుగా పాపికొండలు వెళ్లారు. ఐదు బోట్లలో సుమారు 330 మంది పర్యాటకులు పేరంటాలపల్లిలో సందడి చేశారు.

పోశమ్మగండి ఆలయానికి భక్తుల తాకిడి

కోరికకోర్కెలు తీర్చే మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. వేకువజామున గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిక్కెట్లు తదితర వాటి ద్వారా రూ24,500 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పీఎం జన్‌మన్ నిధులు మంజూరుపై హర్షం

రంపచోడవరం, జూన్ 23: ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద మన్యం రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరుపై జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి అధ్యక్షులు కారం సీతారామన్నదొర(ఢిల్లీ బాబు) హర్షం తెలిపారు. ఈ మేరకు నిధుల మంజూరు చేయడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. రూ.36కోట్లతో అనంతగిరి మండలంలో 8, అరకులోయలో 2, దుంబ్రిగుడ మండలంలో 10 రహదారులను అభివృద్ధి చేయనున్నారని తెలిపారు. ఆగష్టు నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించాలని ఆయన పంచాయితీరాజ్ శాఖాధికారులను కోరారు. రహదారులు నిర్మిస్తే మన్యంలో డోలిమోతలు ఫుల్‌స్టాప్ పడనున్నాయన్నారు. మంజూరైన పనులన్నింటికీ తక్షణమే అటవీశాఖ అనుమతులు ఇవ్వాలన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

వై.రామవరం, జూన్23: డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం మండల బీజేపీ అధ్యక్షుడు పొత్తూరు రాంబాబు, బీజేపీ జిల్లా కార్యదర్శి స్వప్నకుమారి ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు జరిపారు. అనంతరం ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దేవీపట్నం: మండలంలో కొండమొదలు ఆర్అండ్ఆర్ కాలనీ-3 లో బూత్ నెంబర్ 192లో ఆదివారం దేశభక్తుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటంవద్ద బీజేపీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు కారం రామన్నదొర, ప్రధాన కార్యదర్శి కుండ్ల సాయిరాం, రెడ్డి బీజేవైఎం నడిపూడి గణపతిరెడ్డి, జనసేన కురసం వెంకన్నదొర పాల్గొన్నారు.

కూటమి అధికారంలోకి రావడంతో సంబరాలు

దేవీపట్నం, జూన్ 23: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో మండలంలోని శరభవరం గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు యాండ్రా ఆంజనేయులు, మండల రైతు అధ్యక్షుడు జొన్నల రాంబాబు(నాని) ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.కార్యక్రమంలో జోగి వీరవెంకటరావు, నాయకులు ముంద్రుల మధుసూధనరావు, లంక హరిశ్చంద్రుడు, ఎల్లెటి మోహన్, చిక్కాల బూరయ్య, మడకం శ్రీనివాసదొర, జొన్నల రాంబాబు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యకుడు పల్లా శ్రీనివాసరావుని కలిసిన చందు

ఎటపాక, జూన్ 23: గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావును ఆదివారం తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. చందు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపి, అనంతరం సత్కరించారు. చందు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలకు సముచితం స్థానం కల్పిస్తానన్నారు.

యూ టర్న్

- రాజీనామా చేసిన వలంటీర్ల యత్నాలు
- అప్పటి అధికార పార్టీ నాయకులు బెదిరించారని..
- ఇష్టం లేకుండానే రాజీనామాలు చేశామంటున్న వైనం
- వైసీపీ ముద్రను తొలగించుకునే ప్రయత్నం



అనపర్తి మండలం రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లిని కలిసి తమ గోడును వెల్లబోసుకుంటున్న పెదపూడి వలంటీర్లు(ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 22: గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయల్లో క్షేత్ర స్థాయిలో కీలకంగా వ్యవహరించే వలంటీర్ వ్యవస్థ గుండెల్లో ఇప్పుడు రైళ్ల పరిగెడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్లను జగన్ ఏర్పాటు చేసుకున్నారు. వీరంతా విధేయులుగా తనకు ఎన్నికల్లో పని చేస్తారని వీరిపై చాలా నమ్మకంతో క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమయ్యే విధంగా తయారు చేసి వారి సేవలను ప్రజలకు అందించేలా చేశారు. కానీ సార్వత్రిక ఎన్నికల సమయంలో వలంటీర్ల విషయంలో భారత ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికలు ముగిసే వరకు వలంటీర్లు విధులు నిర్వహించరాదని, ప్రజల్లోకి వెళ్ళరాదని మార్గదర్శకాలు జారీ చేసింది. వారందరి ఫోన్లను స్వాధీనం చేసుకుంది. దీంతో జగన్ గొంతులో వెలక్కాయపడినట్టు అయ్యింది. దీంతో వైసీపీ నేతలు ఎక్కడికక్కడ వలంటీర్లతో రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకుని వారికి వివిధ ఆసక్తికర ప్యాకేజీలు ఇచ్చి రాజీనామాలు చేయించుకున్నారు. రాజీనామాలు చేయబోమన్న వారిని భయపెట్టడం కూడా జరిగింది. కొంత మంది అయితే ఏం జరిగే అది జరుగుతుందని తటస్థంగా ఉండిపోయి ఇళ్ళకు పరిమితమయ్యారు. కట్ చేస్తే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కూటమికి ఏకపక్షంగా పట్టం కట్టారు. దీంతో అలా తటస్థంగా ఉన్న వలంటీర్లు ఊపిరి పీల్చుకుని తమకు నూతన ప్రభుత్వం అవకాశం ఇస్తుందని ఎదురుచూస్తున్నారు. అయితే రాజీనామాలు చేసిన వారు మాత్రం ఇక మనకు అవకాశాలు ఉండవని యూటర్న్ తీసుకుంటున్నారు. తమకు ఇష్టం లేకుండానే రాజీనామాలు చేశామని, తమను వైసీపీ వాళ్లు భయపెట్టారని ఇప్పుడు చెబుతున్నారు. కొన్ని చోట్ల అయితే బెదిరించిన నాయకులపై కేసులు పెడుతున్నారు. రాజమహేంద్రవరంలో మాత్రం రాజీనామాలు చేసిన వారు కేసులు వరకు వెళ్లలేదు కాని వైసీపీ ముద్రను తొలగించుకుని ఎలాగోలా మళ్లీ ఉద్యోగంలో చేరాలనే ప్రయత్నాలు చేస్తున్నారు.

95 సచివాలయాల్లో సుమారు 1540 మంది..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో 95వార్డు సచివాలయాల ద్వారా నగరంలో సుమారు 1540 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. గత ప్రభుత్వం మొత్తం 1650 మంది వలంటీర్లను తీసుకుంది. కాని వివిధ కారణాలతో మధ్యలోనే 84 మంది ఆగిపోవడంతో ఆ సంఖ్య 1566కు చేరిం ది. ఎన్నికల ముందు సుమారు 26మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. వైసీపీ అధికారంలోకి వస్తుందని భావించిన వారికి భంగపాటు తప్పలేదు. అయితే తటస్థంగా ఉన్న వలంటీర్లలో కూడా కొంతమంది వైసీపీకి అనుకూలంగా ఉన్నారనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఎందుకంటే వలంటీర్లలో వారిలో వారే ఒకరిపై ఒకరు వివిధ అంశాలపై విభేదించుకుని వారి వైఖరిని బయటపెట్టుకుంటున్నారు. కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో ఒక్కొక్క సచివాయాలనికి సగటున 10నుంచి 15మంది వలంటీర్లు ఉన్నారు. వలంటీర్ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళణ చేస్తే వారిలో ఎంత మంది నిలబడతారో వేచిచూడాలి. ప్రస్తుతానికి వలంటీర్లు వారి వారి సచివాయాలకు వచ్చి వెళ్తున్నారు. రాజీనామా చేసిన వాళ్లు మాత్రం ఎలా మళ్లీ రావాలనే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలిసింది. వచ్చే నెల 1నుంచి పింఛన్ల బట్వాడాలోగా ఈ సమస్యకు ఒక పరిష్కారాన్ని చూపే పనిలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

30న రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 23: రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఈనెల 30వ తేదీన రాజమహేంద్రవరం శ్రీ సరస్వతి ఎడ్యుకేషనల్ అకాడమి (హుకుంపేట)లో నిర్వహిస్తున్నారు. జిల్లా చదరంగ సంఘం, కాల్ ఫ్యూషన్ చెస్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో టోర్నమెంట్ జరుగుతుందని నిర్వాహకుడు విత్తనాల కుమార్ పేర్కొన్నారు. ఏ వయసు వారైనా పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన 30 మందిని విజయవాడలో జూలై 12 నుంచి 14వ తేదీ వరకూ జరిగే జాతీయస్థాయి టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు సెల్ 95055 42888 నెంబరులో సంప్రదించాలన్నారు.

మూలారెడ్డి ఆశయాలకు అనుగుణంగా సేవలు



రామవరంలో మూలారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- రామవరంలో కూటమి నాయకుల ఘన స్వాగతం

అనపర్తి, జూన్ 23: దివంగత మాజీ శాసనసభ్యుడు, టీడీపీ వ్యవస్థాపక సభ్యుడు నల్లమిల్లి మూలారెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందిస్తానని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం అనంతరం మొదటిసారిగా స్వగ్రామమైన రామవరం వచ్చిన ఆయనకు కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దివంగత ఎమ్మెల్యే మూలారెడ్డి విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి, పేదల సంక్షేమానికి పెద్ద పీట వేస్తానన్నారు. రహదారుల అభివృద్ధి, సాగునీటి సరఫరాలో ఇబ్బందులను తొలగించడం, కెనాల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అలాగే విద్య, వైద్య సేవలు ప్రతి పేద వాడికి అందేలా చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, శివరామారెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, కర్రి చిన్నారెడ్డి, తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి రామవరం, కుతుకులూరు సర్పంచ్‌లు గిరిడా గంగా భవాని, గొల్లు హేమతులసి పాల్గొన్నారు.

పాలకుడిగా కాదు.. సేవకుడిగా పనిచేస్తా

- తాగు, సాగునీరుకు అధిక ప్రాధాన్యం
- రంగనాథస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు కృషి
- మీడియా సమావేశంలో బత్తుల బలరామకృష్ణ



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, జూన్ 23: నియోజకవర్గ ప్రజలకు పాలకుడిగా కాకుండా సేవకుడిగా ఉంటానని ప్రజలు ఊహించిన దాని కంటే ఎక్కువ అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణం చేసి తొలిసారి కోరుకొండకు వచ్చిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం సాయంత్రం అపూర్వ స్వాగతం పలికారు. అమరావతి నుంచి రోడ్డు మార్గంలో వచ్చిన ఆయనకు గాడాల వద్ద ఘన స్వాగతం లభించింది. అనంతరం కోరుకొండ, మీదుగా భారీ ప్రదర్శనగా గాదరాడకు చేరుకున్నారు. పలుచోట్ల ఆయనను గజమాలతో సత్కరించారు. కోరుకొండ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఆలయ చైర్మన్ పరాసర రంగరాజభట్టర్ ఆధ్వర్యంలో అర్చకస్వాములు, వేద పండితులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం బలరామకృష్ణ దంపతులు, కుటుంబీకులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆపై గాదరాడ చేరుకుని గాదరాడ ఓం శివశక్తి పీఠంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా నరసింహస్వామి ఆలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు నరసింహస్వామి ఆలయంలో సుదర్శన యాగం చేద్దామనుకుంటే ఆనాటి పాలకులు అడ్డుకున్నారని, స్వామివారి కల్యాణోత్సవాల్లో కూడా పాల్గొనకుండా అధికారులను బెదిరించారన్నారు. నరసింహస్వామి అనుగ్రహంతో ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించారని, సేవకుడిగా పని చేస్తానని బత్తుల పేర్కొన్నారు. నియోజకవర్గంలో సాగు, తాగునీరుకు అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. రోడ్లు, డ్రైన్లు, వీధిలైట్లు ఏర్పాటు చేస్తానన్నారు. రంగనాథస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు కృషి చేస్తానన్నారు. ముందుగా కోరుకొండ నరసింహస్వామికి పానకంతో అభిషేకంచేసి 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కుచెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో బత్తుల వెంకటలక్ష్మి, తోట ప్రత్యూషదేవి, బత్తుల వందనాంబిక, బత్తుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అనపర్తిలో ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూన్ 23: దేశ సంరక్షణ కోసం భారత్ జన సంఘ్‌ను స్థాపించి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. దేశ సంరక్షణ కోసం ప్రాణాలర్పించిన ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని ఆదివారం అనపర్తి ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించారు. బీజేపీ నియోకవర్గ కన్వీనర్ శివరామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కాశ్మీర్ సమస్యపై గళం విప్పిన ముఖర్జీని జైలుకు పంపించారని, ఆయన జైలులోనే మృతి చెందినట్టు ప్రకటించారని కానీ ఆయన మరణం వెనుకున్న కారణాలు మిస్టరీగా ఉండిపోయాయని అన్నారు. ఒకటే దేశం, ఒకరే ప్రధాని నినాదంలో దేశ సంరక్షణకు ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. ముందుగా ముఖర్జీ చిత్రపటానికి ఎమ్మెల్యే సహా పలువురు బీజేపీ నాయకులు పూలమాలలతో నివాళులర్పించారు. ముందుగా రామవరం, కుతుకులూరు సర్పంచ్‌లు గంగాభవాని, హేమతులసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గంగిరెడ్డి, తమనంపూడి రామకృష్ణారెడ్డి, పవన్‌రెడ్డి, సత్యనారాయణ, సాయిరామ్, సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరంలో 42వ శక్తి కేంద్రం ప్రముఖ్ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొల్లి సావిత్రి, చిలకల వీరమ్మ, కోడి భవానీ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అనపర్తి, జూన్ 23: అనపర్తి మండలం లక్ష్మీనరసాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశానికి మిగిలి ఉన్న సీట్లకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని 27వ తేదీన ఉదయం 10గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని మార్కుల ఆధారంగా సీట్లను భర్తీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

ఉద్యోగుల సంఘం నాయకుడు సాయిబాబా

కడియం/రాజమహేంద్రవరం రూరల్, జూన్ 23: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను, ఎల్‌ఐసీని ప్రభుత్వరంగంలోనే ఉంచేందుకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కృషి చేయాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం నాయకుడు పులగుర్త సాయిబాబా ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. పలు ప్రైవేటు సంస్థల్లో కాంట్రాక్టులో పనిచేస్తున్న సెక్యూరిటీ, క్లీనింగ్ సిబ్బంది జీతాల్లోంచి పీఎఫ్ రికవరీ చేసి ఈపీఎఫ్‌వోకు జమ చేయని సందర్భాలెన్నో ఉన్నాయన్నారు. ఇటువంటి సందర్భాల్లో ఎల్‌ఐసీ యూనియన్లు, ఇతర సంఘాలు ముందుకొచ్చి కార్మికుల పీఎఫ్ జమ చేయిస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన మద్దతు కేంద్ర ప్రభుత్వానికి ఉంది కాబట్టి ఆ పార్టీల మాట ను కేంద్రం గౌరవిస్తుందని విశాఖ స్టీల్ ప్లాంట్, ఎల్‌ఐసీలు ప్రభుత్వరంగంలో ఉంచేందుకు కృషిచేసేందుకు ఇదే మంచి అవకాశమని సాయిబాబా అన్నారు.

కబడ్డీ క్రీడాకారుడు అమరనాథ్ సంస్మరణ సభ

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 23: కబడ్డీ క్రీడాకారుడిగా గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తి కలిగి ఉండడం కుంపట్ల అమరనాథ్ గొప్పదనమని పలువురు కీర్తించారు. స్థానిక ప్రకాశనగర్ ధర్మంచర కమ్యూనిటీ హాలులో ఆదివారం శ్రీ వివేకానంద స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అమరనాథ్ సంస్మరణ సభలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, వర్తక ప్రముఖులు అశోక్‌కుమార్ జైన్, ప్రాసాదుల హరినాథ్, ఎస్.ఎన్ రాజా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉండవల్లి మాట్లాడుతూ తాను అనుకొన్నది నిర్భయంగా చెప్పడంలో, తన వాదనను వినిపించడంలో ఎక్కడా రాజీ పడని ధోరణి అతనిదని గుర్తు చేశారు. పంతం కొండలరావు మాట్లాడుతూ అమరనాథ్ మంచి హాస్య చతురత గల వాడని అన్నారు.

ప్రతి ఆదివారం ఉచిత కూచిపూడి శిక్షణ

దేవరపల్లి, జూన్ 23: భారతీయ కళలైన కూచిపూడి, భరతనాట్యాలను గ్రామీణ ప్రాంతాల్లో వెలికి తీయడానికి విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని రాజమహేంద్రవరానికి చెందిన నృత్యనాట్యకారిణి కె.సత్యశ్రావణి అన్నారు. దేవరపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతి ఆదివారం కూచిపూడి, భరతనాట్యంలో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. తన తండ్రి ఎస్ఆర్ఎం భాస్కరరావు నృత్యకళాకారుడని, ఆయన వారసత్వంగా నాలుగో ఏట నుంచే భరతనాట్యం, కూచిపూడి నృత్యం నేర్చుకున్నానని, 17 ఏళ్లుగా నాట్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నిడదవోలు, సమిశ్రగూడెం, దేవరపల్లి, అంకంపాలెం, ర్యాలీ, రాజమహేంద్రవరం, పురుషోత్తపట్టణ గ్రామాల్లో విద్యార్థులకు కూచిపూడి, భరతనాట్యంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పొందిన విద్యార్థినులతో పలు చోట్ల ప్రదర్శనలు కూడా ఇచ్చామన్నారు. కార్యక్రమంలో శిష్య బృందం, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 23: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం ద్వారా ఈ నెల 24వ తేదీ నుంచి ప్రతి సోమవారం ప్రజల వద్ద నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు కమిషనర్ కె.దినేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. స్పందన కార్యక్రమం స్థానంలో నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారానికి ఫిర్యాదులను మీ కోసం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా స్వీకరిస్తామన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ప్రజలు ఈ మార్పును గమనించాలని కోరారు.

వాసవీక్లబ్ డాన్ టూడస్ట్-2024

రాజమహేంద్రవరంసిటీ, జూన్ 23: రాజమహేంద్రవరం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో డాన్ టూడస్ట్ 2024 ప్రోగ్రాం ఆదివారం నిర్వహించారు. బ్లైండ్ స్కూల్ విద్యార్థులకు చేతికర్రలు, నేతాజీ స్కూల్‌కు చెందిన విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, ట్రాఫిక్ పోలీసులకు మాస్కులు, రుమాళ్ళు, ఓల్డేజ్ హోమ్‌కు సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వీరభద్ర రావు, గార్లపాటి శ్రీనివాస్, సీతామహాలక్ష్మి,చంద్రగుప్త తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి సింహాసనం అందజేత



రాజానగరం, జూన్ 23: రిటైర్డ్ హెచ్ఎం ఆర్ఎస్ వెంకట్రావు జయంతి సందర్భంగా ఆయన కుమారులు ఆర్.రామబ్రహ్మం, ఆర్‌వీవీఎస్ఎస్ మూర్తి రాజానగరంలోని శ్రీరాజలింగేశ్వర, వేణుగోపాల స్వామి దేవస్థానం(శివాలయం)నికి టేకు కర్రతో తయారు చేసిన నెమలి సింహాసనం బహూకరించారు. స్వామి కల్యాణోత్సవాలు జరిపించేందుకు అందజేసినట్టు ఆలయార్చకులు కూచిమంచి శ్రీనివాసరావు తెలిపారు.

ప్రత్యేక అవకాశాలు కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి రెల్లికుల సంక్షేమ సంఘం వినతి



సమావేశంలో ఐక్యత అభివాదం చేస్తున్న రెల్లీలు

రాజమహేంద్రవరంసిటీ, జూన్ 23: ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రెల్లి కులాలకు కూటమి పాలనలో ప్రత్యేక అవకాశాలు కల్పించాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నీలాపు వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొడుగుకుమార్, కోశాధికారి బంగారు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఇసుకపల్లి వెంకటేశ్వరరావు, బంగారు ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రాజ్‌కుమార్, ముత్యాల మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గోరంట్లకు అభినందనలు వెల్లువ



ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అగ్నిమాపక అధికారులు

కడియం/రాజమహేంద్రవరంరూరల్, జూన్ 23: సార్వత్రిక ఎన్నికల్లో ఘన ఎమ్మెల్యేగా విజయం సాధించిన గోరంట్ల బుచ్చయ్యచౌదరిని అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, ఎస్ఐ రమణ, పలువురు ప్రభుత్వ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, విశ్రాంత ఉద్యోగులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 24 జూన్ 2024 | 3





అక్రమ భవనానికి నోటీస్ అంటిస్తున్న మునిసిపల్ ఉద్యోగులు.. మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్ జారీ చేసిన నోటీస్

భయపెట్టి భవనం కట్టేశారు!

- అక్రమంగా వైసీపీ భవనం
- కనీస అనుమతుల్లేవ్
- రూ.5 కోట్లతో నిర్మాణం
- నోటీసు ఇచ్చిన అధికారులు
- వారం రోజులు గడువు
- వైసీపీ కేడర్‌లో వణుకు

రాజమహేంద్రవరం,జూన్ 23(ఆంధ్రజ్యోతి) : వైసీపీ అక్రమ భవనంపై అధికారులు ఇన్నాళ్లకు కళ్లు తెరి చారు..గత ఏడాదిగా భవన నిర్మాణం సాగుతున్నా భయంతో అధికారులు పట్టించుకోలేదు. అయితే ప్రభుత్వం మారడం..భవన నిర్మాణం అక్రమమని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది.ఇన్నాళ్లకు అధికారులు ఆ భవనానికి నోటీసు అంటించారు. దీంతో వైసీపీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.వైసీపీ ప్రభుత్వం రాజమ హేం ద్రవరంలోని ఆర్‌అండ్‌బీకి చెందిన సుమారు రూ.100 కోట్ల విలువైన 2 ఎకరాల భూమిని ఏడాదికి కేవలం రూ.1000 లీజుకు తీసుకుని ఎటువంటి అనుమతులు లేకుండా వైసీపీ కార్యాలయాన్ని నిర్మించింది. ఇది అక్రమ నిర్మాణం అంటూ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్(ఐఏఎస్ అధికారి) కె.దినేష్‌కుమార్ నోటీసు ఇచ్చారు. వైసీపీ జిల్లా ప్రెసిడెంట్ పేరుతో నోటీసును వైసీపీ కార్యాలయ స్థంభానికి అతికించారు. ఈ భవనం సుమారుగా పూర్తయింది. ఇక ఫినిషింగ్ టచ్ మాత్రమే. భూమిని లీజుకు తీసుకున్న సమయంలో కూడా నిబంధనలు పాటించలేదు.నగర పాలక సంస్థ కౌన్సిల్ తీర్మానం తీసుకోవాలి. కానీ తీసు కోలేదు. ఇక్కడ పాలకవర్గం లేదు. కానీ జిల్లా కలెక్టర్ స్పెషలాఫీసర్‌గా ఉన్నారు.కేవలం రెవెన్యూ అధికారులే ఏడాదికి రూ.1000 లీజుతో 2 ఎకరాల భూమిని కట్టబెట్టేశారు.సుమారు 5 కోట్ల ఖర్చుతో భవనం నిర్మించారు. దీనికి ఎటువంటి అనుమతులు తీసుకోకపోవడంతో వైసీపీ ఇరకాటంలో పడింది..నగరంలో భారీ భవంతులు నిర్మించాలంటే రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (రుడా) అనుమతి తీసుకోవాలి.కనీసం ఇంతవరకూ అనుమతికి దరఖాస్తు కూడా ఇవ్వకుండా ఏకంగా ఏడాదిలో ఓ ఇంద్రభవనంలా వైసీపీ జిల్లా కార్యాలయాన్ని నిర్మించారు.దీని అనుమతికి తమకు ఎటువంటి దరఖాస్తు రాలేదని రుడా వైస్ చైర్మన్ బాలస్వామి తెలిపారు.మరో ప్రక్క మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ నోటీసు ఇచ్చారు.వారం రోజులు గడువు ఇచ్చామని,వారి సమాధానం ఏమిస్తారో చూసి తర్వాత చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అల్లూరు కలెక్టర్ దినేష్‌కుమార్

అల్లూరు జిల్లా కలెక్టర్‌గా రావడం ఆనందంగా ఉంది..

- నాకు అల్లూరు జిల్లా కొత్తేంకాదు
- గతంలో ఐటీడీఏ పీవోగా పనిచేశా
- గిరిజనం అంటే చాలా ఇష్టం
- జిల్లా అభివృద్ధికి పాటుపడతా
- 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ దినేష్‌కుమార్

(రంపచోడవరం)

నాకు ఈ జిల్లా కొత్తేంకాదు.. నేను ప్రజలకు కొత్త కాదు.. అంతా నాకు సుపరిచితమే.. ఈ జిల్లాకు రావడం చాలా ఆనందంగా ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రజలు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో సమగ్రాభివృద్ధి సాధించడమే లక్ష్యమని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా నియమితులైన ఆయన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు.

మీకు అల్లూరి జిల్లాతో అనుబంధం ఎలా?

గతంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా చంద్రబాబు ప్రభుత్వంలో పని చేశా. నాడు గిరిజన అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల పునరావాసం అంశాలపై పురోగతిని చూపించా. అది గుర్తుపెట్టుకున్నారో ఏమో కానీ.. విభజిత జిల్లాలో ఇప్పుడు రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏ ప్రాంతాలతో ఉన్న జిల్లాకు కలెక్టరుగా నియమించారు. నాకు చాలా ఆనందంగా ఉంది. సమస్యలు ఎక్కడ ఉంటాయో అక్కడ ఉండడం పరిష్కరించడమే నాకు అలవాటు.

మా జిల్లా అంటే ఎందుకు ఇష్టం..

అల్లూరి జిల్లా అంటేనే ప్రకృతి ఒడిలో సహజ వనరులతో, నిష్కల్మషమైన గిరిజనులతో నిండి ఉన్న ప్రాంతం. అందుకే అల్లూరి జిల్లా అంటే ఇష్టం. ఈ ప్రాంతంలో సేవ చేయడాన్ని ఎంతో పవిత్రంగా, గొప్పగా భావిస్తా. జిల్లాలో ఉన్న రంపచోడవరం, పాడేరు, చింతూరు ఐటీడీఏలకు చైర్మన్‌గా ఉన్నా. అందువల్ల జిల్లాలో ఆదాయ వనరులపై నాకు అవగాహన ఉంది. గతానుభవంతో గిరిజనుల సమగ్రాభివృద్ధికి నిర్ధిష్టమైన ప్రణాళికలను అమలు చేస్తా. గిరిజన ఆరోగ్యం, విద్య తదితర మానవవనరులను మెరుగుపర్చే కృషి సాగిస్తా. ఐటీడీఏల పాలకవర్గ సమావేశాలను సక్రమంగా నిర్వహింపజేస్తూ ఆయా ప్రణాళికలను అమలు చేస్తా.

గతంలో మీ మార్కు ఏంటి?


రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా గిరిజనాభివృద్ధికి బాటలు వేశా. గిరిజన విద్యాసంస్థల్లో పౌష్టికాహారాన్ని అందించే దిశగా అక్షయపాత్ర అనే వ్యవస్థను కూడా ఇక్కడ పరిచయం చేశా. తద్వారా గిరిజన విద్యాలయాల్లో ఆహారాన్ని అందించే పథకాల్లో అక్రమాలను నిరోధించా.

పోలవరానికేం చేశారు?

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, దాని కింద పునరావాస చర్యలు, ముంపు గ్రామాలను ఖాళీ చేయించే అంశాలపై పరిశీలనకు గత చంద్రబాబు ప్రభుత్వం చైనాలోని త్రీగాడ్జెస్ ప్రాజెక్టు పర్యటకు పంపించారు. పరిశీలన అనంతరం నివేదిక ఇచ్చా.ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో నివేదిక మూలన పడింది. ఫలితంగా పునరావాసాన్ని పూర్తి చేయకుండా పోలవరం నిర్వాసితులను జగన్ ప్రభుత్వం గ్రామాలు ఖాళీ చేయించేయించిన విషయం తెలిసిందే! తిరిగి చంద్రబాబు ప్రభుత్వంలో కలెక్టర్ నియమితుడినయ్యా ఇప్పుడా ఆ నివేదిక చాలా ఉపయోగపడుతుంది. పోలవరం ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యతా అంశం.. అందులో నిర్వాసితుల పునరావాసం కూడా కీలకమే. పునరావాస అంశాలపై నివేదిక రప్పించుకుని, పునరావాస పురోగతికి ఖచ్చితమైన టార్గెట్లను పెట్టి నిర్దిష్ట కాలాన్ని నిర్దేశించి చర్యలు తీసుకుంటా.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ మేరకు పటిష్టమైన చర్యలు తీసుకుంటాన్నారు. పూర్తి పారదర్శకతతో అవినీతి రహితంగా జిల్లాలో పాలన సాగించే దిశగా అన్ని చర్యలు తీసుకుంటానన్నారు.

రెక్కలు తెగిన పక్షులు!

కూటమిని కాకాపడుతున్న 'గాలి'వీరులు



ఒక్క చాన్స్ అంటే నమ్మి ఫ్యాన్‌ని 151 వద్ద పెట్టారు.. అంత స్పీడ్ తట్టుకోలేకపోతున్నాం.. మాకు ప్రజలు 151 ఇచ్చారు కదా అని ఇష్టానుసారం చేస్తున్నారు.. అలా కాదు ఈ సారి జీరోలో పెట్టండి.. ఇదీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి ఇచ్చిన పిలుపు.. గోదావరి జిల్లాల ప్రజలు అచ్చంగా ఇలాగే చేశారు.. ఒక్క సీటు ఇవ్వలేదు.. దీంతో అప్పటి వరకూ ప్రగల్బాలు పలికిన వైసీపీ నాయకులు నేడు మచ్చుకైనా కానరావడంలేదు.. కూటమి సునామీలో ప్రజా తీర్పుతో గల్లంతైపోయారు.. రెక్కలు తెగిన పక్షుల్లా మారిపోయారు. నేడు ఏ పార్టీలో ఖాళీగా ఉందా అని పక్క చూపులు చూస్తున్నారు.. ఏదో ఒక విధంగా నామినేటెడ్ పదవులను నిలబెట్టుకోవాలని మరికొందరు చూస్తున్నారు. ఇలా వైసీపీ నాయకగణం ఎవరి వేటలో వారున్నారు..



- గోదావరి జిల్లాల్లో ఫ్యాన్‌కు జీరో
- చిన్నమ్మ చెప్పిందే.. ఓటర్లు చేశారు
- ప్రజా తీర్పుతో అయోమయం
- బయటకు రాలేకపోతున్న నేతలు
- శపథాల మాటేంటని ప్రశ్నిస్తున్న జనం
- అటూ ఇటూ చూస్తున్న వైసీపీ నాయకులు
- అయితే జనసేన..కాదంటే బీజేపీ?
- నామినేటెడ్ పదవులూ వదలని వైనం
- గత ప్రభుత్వంలో గోపీల ఆందోళన
- నిస్తేజంగా మారిన వైసీపీ కేడర్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'గాలి'వాటం పార్టీ అండ చూసుకొని రెచ్చిపోయారు. జగన్ తన చెప్పుతో పోల్చినా ఆనంద పడిపోయారు. చట్టం దలదించుకొనేలా దందాలు సాగించారు. అధినేత దగ్గర నుంచీ వీధి నాయకుడి వరకూ అక్రమాల్లో మునిగితేలారు. ఐదేళ్ల పాటు జనాలను పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రతిపక్షంపై రాజకీయ కక్ష సాధించడానికి తమను ప్రజలు ఎన్నుకున్నట్టుగా బరితెగించారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాలు ఉండవనే మాటే మరిచారు. వైసీపీ అధికారంలోకి రాకపోతే రాజకీయ సన్యాసం చేసేస్తామంటూ శపథాలు చేశారు. అన్నీ చూసి విసిగిపోయిన జనం ఓటుతో చాచి కొడితే చికిత్సకు పనిచేయని శరీరంలా మారిన పార్టీని చూసుకొని మొఖ్ల మంటున్నారు. పార్టీ దాదాపు భూస్థాపితం కావడానికి 11 అడుగుల దూరంలో మాత్రమే ఉండడంతో రాజకీయ భవిష్యత్తు తలచుకొని కళ్లు వాచిపోయేలా రోదిస్తున్నారు. 'కూటమి'లో కలిసిపోవడానికి ప్రయత్నాలూ ఆరంభించారు. ఈ క్రమంలో వైసీపీ ఖాళీ కావడానికి దగ్గర పడుతుండడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ఉత్తుత్తి శపథలేనా?

వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందనే భ్రమలో కొందరు వైసీపీ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడేశారు. పార్టీ మళ్లీ అధికారంలోకి రాకపోతే రాజకీయ సన్యాసం చేస్తామంటూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాజమండ్రి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి శపథం చేశారు. వైసీపీ అధికారం మాట అలా ఉంచితే అంధకారంలోకి వెళ్లిపోయి 19 రోజులు గడిచింది. అయినా తమ మాట నిలబెట్టుకొనే విషయంపై వైసీపీ నాయకులు కిక్కురుమనడం లేదు. ఈ కోవలోనే శపథం చేసిన ముద్రగడ పద్మనాభం తన మాట నిలబెట్టుకుంటూ పద్మనాభరెడ్డిగా మారిపోయారు.దీంతో మిగిలిన వాళ్ల తమ శపథాలు ఎప్పుడు నెరవేర్చుతారా అని జనం ఎదురు చూస్తున్నారు.మరి కొంతమంది వైసీపీ నాయకులు నామినేటెడ్ పదవులను ఇంకా పట్టుకొని వేలాడుతున్నారు. గెంటేసే వరకూ వెళ్లేది లేదనే దర్పం ప్రదర్శిస్తున్నారు. వైసీపీ నాయకులు ఎవరూ వీధుల్లో కానరావడం లేదు.తమ విపరీతమైన ప్రవర్తనతో విసిగిపోయిన జనం తమను పురుగుల మాదిరిగా చూస్తారనే భయంతో ముఖం చెల్లగా బయట తిరగలేకపోతున్నారని ఆ పార్టీలోని కొందరు అంటున్నారు. జనాలు నిలదీస్తే ఏమి సమాధానం చెప్పాలో కూడా తెలియక ఇళ్లకు కొందరు, పొరుగూళ్లకు కొందరు పరిమితమైపోయారని చెబుతున్నారు.

వర్గపోరుతో నలిగిపోయారు

వర్గపోరు, అహంభావానికి వైసీపీ పెట్టింది పేరు. పైగా ఎప్పుడు ఎవరిని ఎక్కడి నుంచి పీకేసి ఎక్కడికి పంపిస్తారో తెలియని పరిస్థితిలో క్యాడర్ అయోమయంలో కొట్టుమిట్టాడింది. ఎప్పుడు ఎవరికి జైకొట్టాలో తెలియని పరిస్థితి దాపురించింది. వైసీపీ రాజకీయ బదిలీలు, ఎప్పుడు ఎవరు ఎక్కడ నుంచి బరిలో ఉంటారో తెలియని గందరగోళంతో కార్యకర్తలు ఆందోళనలో పడిపోయారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నుంచి గోడదూకిన వారికి పెద్దపీట మాట ఎలా ఉన్నా సముచిత స్థానం కూడా వైసీపీలో దక్కలేదు.అయినా చేసిన తప్పునకు నెట్టుకురాలేక తప్పలేదు. టీడీపీలో నగర, ఉన్నతస్థాయి పదవులు అనుభవించిన వారు కూడా వైసీపీ పంచన చేరారు. ఇప్పుడు వారి రాజకీయ జీవితం కుడితిలో పడ్డ ఎలక మాదిరిగా తయారైంది. అటు వైసీపీ పని అయిపోవడం.. ఇటు సొంత గూటికి చేరడానికి ముఖం చెల్లక సతమతమవుతున్నారు. అప్పుడు తప్పుచేశామనే భావన వారిలో కనిపిస్తోంది. ఉదాహరణకు టీడీపీలో కార్పొరేటర్‌గా పదవి అలంకరించిన వారికి వైసీపీలోకి దూకిన తర్వాత కనీసం వీధి నాయకులకు ఉన్నపాటి గౌరవం కూడా దక్కకపోవడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలో ఫ్యాన్ జీరో..

ప్రజా స్వామ్యంలో ప్రజలదే అంతిమ తీర్పు అనే నిజాన్ని వైసీపీ నాయకులు గాలికి వదిలేశారు. మళ్లీ మేమే గెలుస్తామంటూ బింకాలుపోయారు.అధినేత చేలో మేస్తే తాము గట్టున మేస్తామా అంటూ వైసీపీ చోటామోటా నాయకులు సైతం రెచ్చిపోయారు. ఇష్టారాజ్యంగా దందాలు సాగించారు. తాజా మాజీ ఎంపీ అయితే టీడీపీ నాయ కులను అక్రమంగా కేసుల్లో ఇరికించడమే పనిగా పెట్టుకు న్నారు. మొదటిసారి ఎంపీగా నెగ్గగానే ఏకంగా మోదీ, చంద్రబాబుపైనే సవాళ్లు విసిరే దుస్సాహసం చేశారు. ఇలాంటి వాళ్లను చూసి క్యాడర్ కూడా అలాగే తయారైంది. ఈ ఎన్నికల్లో వైసీపీ అత్యంత ఘోరంగా పరాజయం పాలైంది. 175కి కేవలం 11 సీట్లతో సరిపెట్టుకోక తప్పలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 21 స్థానాలు ఉండగా ఒక్క స్థానంలోనూ గెలవలేదు. జిల్లా ఓటర్లు అటు పార్ల మెంట్, ఇటు అసెంబ్లీలోనూ కనీసం చోటివ్వలేదు. దీంతో వైసీపీ ఇక కూడదీసుకోలేదనే సంకేతాలు బలంగానే చక్కర్లు కొడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తమ రాజకీయ జీవితం ఏంటని అటు నాయకులు, ఇటు క్యాడర్ దడదడలాడి పోతోంది. టీడీపీ నుంచి వైసీపీలోకి వచ్చి టీడీపీ నాయకులపై విరుచుకుపడిన వాళ్లు బెంబేలెత్తిపోతున్నారు. కొం దరు పొరబాటును గ్రహించి ముందు చూపుతో ఎలా గోలా ఎన్నికలకు ముందే సైకిల్ ఎక్కేశారు. వారికి అది కంగా కాకపోయినా సముచిత గౌరవం దక్కుతోంది. కానీ వైసీపీ గాలిని చూసుకొని ఇష్టానుసారం బరితెగించిన వాళ్లకు మాత్రం వెన్నులో వణుకుపుడుతోంది. ఇదే విష యంపై అంతర్గతంగా కుమ్ములాటలు జరుగుతున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా కొందరు వైసీపీ నాయకులు ఇప్పటికే కూటమివైపు చూస్తున్నట్టు చెబుతున్నారు. వైసీపీ లో మంత్రి హోదాలు వెలగబెట్టిన వాళ్లు సైతం అదే పనిలో ఉన్నారని సమాచారం. అక్రమాలను కప్పిపుచ్చుకోడానికి కూటమిలోని ఏదోక పార్టీ అండతో బతికేయాలని ప్లాన్ చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. జిల్లాలోని ఓ నాయకుడు జనసేన, మరో నాయకురాలు బీజేపీలోకి దూకడానికి నెమ్మ దిగా పావులు కదుపుతున్నారని పార్టీ వర్గాల్లో వినవస్తోంది. వైసీపీ నాయకులు తొలిగా టీడీపీ లేదంటే జనసేన.. అదీ కాదంటే బీజేపీ వైపు పక్కచూపు చూస్తున్నారు.



కరుణించమ్మా..కోటసత్తెమ్మ

నిడదవోలు, జూన్ 23 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనం కలగజేశారు. ఆదివారం మొత్తం రూ.1,50,405 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.



నిన్న కలెక్టర్.. రేపు ఎవరో!

ప్రభుత్వ ఉద్యోగుల్లో టెన్షన్..టెన్షన్

- వైసీపీతో అంటకాగిన అధికారులపై వేటు
- ఇప్పటికే కలెక్టర్ మాధవీలత బదిలీ
- ఆ కోవలోనే మరికొందరు
- రెవెన్యూ, పోలీస్ శాఖలపై దృష్టి
- ఎంపీ, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- సిఫారసులకు తీవ్ర ప్రయత్నాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో జిల్లా అధికారులు.. ఉద్యోగుల్లో బదిలీల భయం పట్టుకుంది. జిల్లాలో ఎక్కువ మంది ఉన్నతాధికారులు కొత్త జిల్లా ఏర్పాటుతో ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఎవరికీ కనీసం మూడేళ్ల సర్వీసు పూర్తి కాలేదు. కానీ తెలుగుదేశం-జనసేన- బీజేపీ కూటమి అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టడంతో పరిపాలన కూడా కొత్తగా ఉండనుంది.ఈ నేపథ్యంలో పాత అధికారులను బదిలీ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలతను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఆమెపై వెల్లువెత్తిన ఆరోపణల నేపథ్యంలో ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీకి రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వులు విడుదల చేశారు.దీంతో వాట్ నెక్స్ అనే మాట వినిపిస్తుంది. ఆ తరువాత ఎవరా అనే లెక్కలు వేసుకుంటున్నారు. వైసీపీతో అంటకాగిన అధికారులు తట్టా బుట్టా సర్దుకునే పనిలోపడ్డారు. ప్రస్తుతం అధికార యంత్రాంగం అంతా ఆందోళనలో మునిగిపోయారు. కలెక్టర్ బదిలీ నేపథ్యంలో ఆదివారం ఎక్కడ చూసినా ఇదే చర్చ సాగడం గమనార్హం. ఒక్కొక్కరి వంతు వస్తుందని, చాలా మంది బదిలీ కావచ్చనే ప్రచారం జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వంతోనూ, వైసీపీ నేతలతోనూ అంటకాగి,వారు చెప్పినట్టు చేసిన అధికారులు, ఉద్యోగులు ఎవరనేది ఇప్పటికే ఆరా తీసినట్టు సమాచారం. ఇష్టానుసారం వ్యవహరించి, నిబంధనలు పాటించని అధికారులకు చుక్కలు చూపించే అవకాశం ఉన్నట్టు సమాచారం. దీంతో ఇక్కడే ఉండడానికి కొందరు, ఇక్కడి వారిని లేపేసి వేరే ప్రాంతాల నుంచి ఇక్కడకు రావడానికి కొందరు ఇప్పటికే ప్రయత్నాలు ఆరంభించారు.

సిఫారసులకు ప్రయత్నాలు..

ఈ నెల 4న టీడీపీ కూటమి విజయం సాధించిన వెంటనే ఆయా అధికారులు, ఉద్యోగులు ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు పేరిట దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎక్కువగా ఎమ్మెల్యేల సిఫారసు లెటర్ల కోసం చూస్తున్నారు.ఎమ్మెల్యేలు కూడా గతంలో తమ పట్ల దురుసుకుగా వ్యవహరించిన అధికారు లెవరూ ఉండకూడదనే అభిప్రాయంతోనే ఉన్నారు. పాలన కొత్తగా ఉండాలని, పక్షపాతం లేకుండా అధికారులు వ్యవ హరించాలన్న ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో కొత్త అధికారులు,ఉద్యోగులైతే ప్రజలకు బాగుంటుందనే అభిప్రా యం వ్యక్తమవుతోంది. కొందరు పాత వారైనా, సమర్ధ వంతంగా, పక్షపాతం లేకుండా పనిచేసేవారుంటే వారిని ఇక్కడే ఉంచాలనే అంచనాలు ఉన్నాయి. అయినా ఎవరి ప్రయత్నాలు వారు మొదలుపెట్టారు. ఎంపీ సిఫారసు లెటర్లకు కొందరు ప్రయత్నిస్తుంటే, జిల్లాలోనే పనిచేయ డానికి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫార్సులెటర్ల కోసం కొందరు ప్రయత్నిస్తున్నారు.

రెవెన్యూ, పోలీసులే టార్గెట్..


తహశీల్దార్లు, సీఐలు ఎక్కువ మంది బదిలీ అయ్యే అవకాశం ఉంది. వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ కుంభకోణాలకు పాల్పడి వైసీపీ నేతలు చెప్పినట్టు చేసిన ఉద్యోగులను ఏరిపారేసే అవకాశం ఉంది. పోలీస్ స్టేషన్లను సెటిల్‌మెంట్ కేంద్రాలుగా మార్చి,కొందరు బ్లాక్‌మెయిర్ల చేత అమాయకులపై కేసులు పెట్టించి, డబ్బు దండుకున్న సీఐల మీద కూడా వేటు పడే అవకాశం ఉంది. తప్పుడు ఫిర్యాదుదార్లను ఏకంగా స్టేషన్లలోపలకే రప్పించుకుని వారితోటే ఫిర్యాదులు చేయించి తప్పుడు కేసులు బనాయించిన సీఐలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. కొందరు కానిస్టేబుళ్ల ఇష్టారాజ్యం ఉంది. డీఎస్పీ స్థాయి అధికారులపైనా ఒక కన్నుంది. ఇక ఇరిగేషన్, మైన్స్ , స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు ,ఉద్యోగులు, వైసీపీ అక్రమాలు, దోపిడీని నిలువరించే ప్రయత్నం చేయలేదని, వారి ఒత్తిళ్లకు భయపడి అక్రమాలను ప్రోత్సహించారనే వాదన ఉంది. ఇసుక , లిక్కర్, సారా అక్రమాలు అరికట్టడం కోసమే ఏర్పడిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కేవలం డబ్బులు దండుకోవడానికి, తప్ప, అక్రమాలు ఆపడానికి ఎక్కడా ప్రయత్నించలేదనే వాదన ఉంది.వీటికి చాలా ఉదాహరణలు చెబుతున్నారు. ఇసుక అక్రమాలపై హైకోర్టు, సుప్రీంకోర్టులే ఆదేశించినా తప్పుడు రిపోర్టుల్లు ఇచ్చారు. ఒక పోలీసు అధికారి ఇసుక కుంభకోణాలపై హైకోర్టును ఆశ్రయించిన ఓ ఫిర్యాదు దారుడిని తన చాంబర్‌లో కూర్చొపెట్టి చుట్టూ పోలీసులు చుట్టుముట్టి ఫొటోలు తీసి తాను చేసిన ఫిర్యాదు తప్పని ఒప్పుకునేలాచేసినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో సదరు ఫిర్యాదుదారు తర్వాత కోర్టులో పిటిషన్ కూడా వేయడం గమనార్హం.ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం కొంత మంది ముఖ్యులపై కూడా వేటు వేయవచ్చనే ప్రచారం ఉంది. ఎవరెవరు వెళతారనే దానిపై ఇప్పటికే అధికారులు ఒక అంచనాకు వచ్చారు.



టమాట.. వినడంలేదు!

బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.100

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 23 : టమోటాల ధర మోత మోగుతోంది. బహిరంగ మార్కెట్లలో కిలో టమోటా ఏకంగా సెంచరీకి చేరువ కావడం ప్రజల్లో ఆందోళన కల్గిస్తోంది. బహిరంగ చిల్లర వ్యాపారులు పావు కిలో రూ.20 నుంచి రూ.25లకు విక్రయిస్తున్నారంటే ధరల దూకుడు ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ధరలు భారీగా పెరగడంతో రైతు బజార్లలోనూ టమోటాలు దొరకడం గగనంగా మారింది. కొన్ని రైతుబజార్లలో గోలీల్లాంటి టమోటాలను అమ్ముతున్నారు. రాజమహేంద్రవరంలోని రైతు బజార్లలో ఒక మోస్తరు నాణ్యత కల్గిన టమోటాలు కిలో రూ.60ల ధర పలుకుతున్నాయి. ఈ ధర నిలకడగా ఇలానే ఉంటుందా లేక మరింత పెరుగుతుందా అన్నది మార్కెట్ వర్గాలు చెప్పలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం జేసీ తేజ్ భరత్ మార్కెటింగ్, పౌరసరఫరాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ధరల నియంత్రణపై చర్చించినట్టు సమాచారం. మదనపల్లె మార్కెట్ నుంచి టమోటాను ప్రొక్యూర్ చేయాలని అధికారులను ఆదేశించినట్టు సమాచారం. ఈ మేరకు రైతు బజార్ల ఎస్టేట్ ఆఫీసర్ల నుంచి ఇండెంట్ తీసుకున్నట్టు తెలిసింది. జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని హోల్‌సేల్ మార్కెట్లు చిత్తూరు జిల్లా టమోటాలపైనే ఆధారపడతాయి. ప్రస్తుతం అక్కడ తప్ప రాష్ట్రంలో ఎక్కడా టమోటా పంటలేదు. ఆ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు మదనపల్లె మార్కెట్‌కు టమోటాలను తీసుకొస్తుంటారు.అక్కడి నుంచే మన హోల్‌సేల్ వ్యాపారులు టమోటాలను దిగుమతి చేసుకుంటారు.బెంగళూరు టమోటా రాకపోవడం కూడా ధరలపై ప్రభావం చూపుతోంది. మన టమోటా అవసరాలకు ప్రస్తుతం మదనపల్లె మార్కెట్ ఒక్కటే దిక్కు కావడంతో డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెరుగుతున్నాయి. శనివారం రాజమహేంద్రవరం హోల్‌సేల్ మార్కెట్‌లో 25 కిలోలు ఉండే టమోటా ట్రే రూ.1400లు ధర పలికిందని వ్యాపారులు చెబుతున్నారు. ఈ లెక్కన హోల్‌సేల్‌లోనే కిలో రూ.56లు పడింది.



నేటి నుంచి 26 రైళ్లకు బ్రేక్

5

నెలన్నర పాటు సర్కార్..రత్నాచల్.. జన్మభూమి తదితర రైళ్లు నిలిపివేత

తూర్పుగోదావరి

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఉదయాస్తమాన సేవలు

కొవ్వూరు, జూన్ 23: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాదులో ప్రారంభమైన వాసవీ క్లబ్ ప్రపంచవ్యాప్తంగా 2000 కేంద్రాలను ఏర్పాటు చేసి ఏటా రూ.కోటి సేవలను అందిస్తోందని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మిన్ వైస్ ప్రెసిడెంట్ అంచూరి శ్రీనివాస గుప్తా అన్నారు. ఆదివారం కొవ్వూరులో వాసవీ క్లబ్, వజ్రవనిత వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్(ఉదయాస్తమాను సేవలు)-2024 కార్యక్రమంలో భాగంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, పాఠశాలకు వాటర్ ట్యాంక్, అంధులకు చేతి కర్రలు, హెల్మెట్‌లు, ఒక పేద కుటుంబానికి తోపుడు బండి వితరణ చేశారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ ప్రసాద్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన కొమ్మిన వెంకటేశ్వరావు


మంత్రి దుర్గేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

నిడదవోలు, జూన్ 23: రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను ఆదివారం నిడదవోలు లో ఒక కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరావు, కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

మలేరియా మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గ్రీష్మకుమార్

నిడదవోలు, జూన్ 23: నిడదవోలుకు చెందిన పెయింటింగ్ కార్మికులు మలేరియాతో అతి చిన్న వయస్సులోనే అకాల మరణం చెందారని, వీరి కుటుంబాలను ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. నిడదవోలులో ఆదివారం జరిగిన అభ్యుదయ పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ సర్వ సభ్య సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. నిడదవోలుకు చెందిన చిన్నం మురళీ, బేజా అన్నవరం పెయింట్ పనికి వెళ్లి మలేరియా బారిన పడి చికిత్స పొందుతూ మరణించారన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రవ్వా సురేష్‌కుమార్, యల్లమిల్లి వర ప్రసాద్, గుంటు సూరిబాబు, యాదల రమణ, యలగాడ రాజ్‌పాల్ తదితర్లు పాల్గొన్నారు.

జనసైనికుడి కుటుంబానికి ఆర్థిక సాయం


శ్రీను కుటుంబానికి సాయం అందజేస్తున్న సువర్ణరాజు

నల్లజర్ల, జూన్ 23: దూబచర్లలోని గాంధీ కాలనీకి చెందిన జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు తాడిగడప శ్రీను ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబాన్ని దొడ్డిగర్ల సువర్ణరాజు,జిల్లా కార్యదర్శి అచ్యుత సత్యనారాయణ, మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.50,000 నగదు, బియ్యం అందించారు. కార్యక్రమంలో రుద్ర శ్రీను, శివకృష్ణ, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ఉన్నమట్ల సత్య, శివకాల సురేష్, పురెల్ల బాలకృష్ణ, లక్కోజు లక్ష్మణ్, జామి వాసు పాల్గొన్నారు

'మానవత' ఉండ్రాజవరం అధ్యక్షుడిగా సిద్ధార్థ

ఉండ్రాజవరం, జూన్ 23: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం మండలంలోని వడ్లూరులో జరిగింది. మండలాధ్యక్షుడిగా కఠారి సిద్ధార్థ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఫణితిని పార్వతి, ట్రెజరర్‌గా కోడూరి శ్రీనివాసరావు, మరో ఆరుగురు సభ్యులుగా ఎన్నికయ్యారు. సిద్ధార్థను కమిటీ సభ్యులు అభినందించారు.

అంబేడ్కర్ విద్య పథకంగా పేరు మార్పుపై హర్షం

ఉండ్రాజవరం, జూన్ 23: ప్రభుత్వం జగనన్న విదేశీ విద్య పేరును అంబేడ్కర్ విద్య పథకంగా మార్చడం పట్ల న్యాయవాది, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు బొల్లిపో సునీల్‌రాజ్ ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం విదేశీ విద్య విధానానికి అంబేడ్కర్ పేరును తొలగించి జగనన్న విదేశీ విద్యగా మార్చిందని, పేరు మార్చమని ప్రభుత్వాన్ని దళితసంఘాలు చాలాసార్లు మొరపెట్టుకున్నా నాటి సీఎం జగన్ స్పందించలేదని పేర్కొన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు స్పందించి అంబేడ్కర్ పేరును కొనసాగించాలని జీవో విడుదల చేయడం పట్ల సునీల్‌రాజ్‌తోపాటు పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి విశేష హోమం


సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళాభక్తులు

ఉండ్రాజవరం, జూన్ 23: ఉండ్రాజవరంలో వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి విశేష హోమం, హారతులు, అభిషేకాలు, సప్తకలశారాధన కార్యక్రమాలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసారు. మహిళాభక్తులు సహస్రనామ పారాయణం నిర్వహించారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు.

డ్రగ్స్ ఆరోగ్యానికి హానికరం

కొవ్వూరు, జూన్ 23: సమాజానికి నష్టం కలిగించే మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని కొవ్వూరు ఎస్‌ఈబీ సీఐ జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బీసీ సంక్షేమ వసతిగృహంలో ఆదివారం డ్రగ్స్, మాదవ ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు, మండలంలోని వేములూరులో ప్రజలకు అవగాహనా సదస్సులు నిర్వహించారు. దేశ భవిష్యత్‌ను కుంగదీసే మాదకద్రవ్యాలు, డ్రగ్స్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. డ్రగ్స్‌తో అనారోగ్యాల పాలవుతారన్నారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో హస్టల్ వార్డెన్ ఆర్.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఆదివారం ఉచిత కూచిపూడి శిక్షణ


కూచిపూడి నృత్య శిక్షణ ఇస్తున్న సత్యశ్రావణి

దేవరపల్లి, జూన్ 23: భారతీయ కళలైన కూచిపూడి, భరతనాట్యాలను గ్రామీణ ప్రాంతాల్లో వెలికి తీయడానికి విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని రాజమహేంద్రవరానికి చెందిన నృత్యనాట్యకారిణి కె.సత్యశ్రావణి అన్నారు. దేవరపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతి ఆదివారం కూచిపూడి, భరతనాట్యంలో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. తన తండ్రి ఎస్‌ఆర్‌ఎం భాస్కరరావు నృత్యకళాకారుడని, ఆయన వారసత్వంగా నాలుగో ఏట నుంచే భరతనాట్యం, కూచిపూడి నృత్యం నేర్చుకున్నానని, 17 ఏళ్లుగా నాట్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నిడదవోలు, సమిశ్రిగూడెం, దేవరపల్లి, అంకంపాలెం, ర్యాలీ, రాజమహేంద్రవరం, పురుషోత్తపట్టణ గ్రామాల్లో విద్యార్థులకు కూచిపూడి, భరతనాట్యంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పొందిన విద్యార్థినులతో పలు చోట్ల ప్రదర్శనలు కూడా ఇచ్చామన్నారు. కార్యక్రమంలో శిష్యబృందం, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

30న రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 23: రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఈనెల 30వ తేదీన రాజమహేంద్రవరం శ్రీ సరస్వతి ఎడ్యుకేషనల్ అకాడమి (హుకుంపేట)లో నిర్వహిస్తున్నారు. జిల్లా చదరంగ సంఘం, కాల్ ఫ్యూషన్ చెస్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో టోర్నమెంట్ జరుగుతుందని నిర్వాహకుడు విత్తనాల కుమార్ పేర్కొన్నారు. ఏ వయసు వారైనా పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన 30 మందిని విజయవాడలో జూలై 12 నుంచి 14వ తేదీ వరకూ జరిగే జాతీయస్థాయి టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు సెల్ 95055 42888 నెంబరులో సంప్రదించాలన్నారు.

యూ టర్న్

- రాజీనామా చేసిన వలంటీర్ల యత్నాలు
- అప్పటి అధికార పార్టీ నాయకులు బెదిరించారని..
- ఇష్టం లేకుండానే రాజీనామాలు చేశామంటున్న వైనం
- వైసీపీ ముద్రను తొలగించుకునే ప్రయత్నం


అనపర్తి మండలం రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లిని కలిసి తమ గోడును వెల్లబోసుకుంటున్న పెదపూడి వలంటీర్లు(ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 23: గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయల్లో క్షేత్ర స్థాయిలో కీలకంగా వ్యవహరించే వలంటీర్ వ్యవస్థ గుండెల్లో ఇప్పుడు రైళ్లు పరిగెడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్లను జగన్ ఏర్పాటు చేసుకున్నారు. వీరంతా విధేయులుగా తనకు ఎన్నికల్లో పని చేస్తారని వీరిపై చాలా నమ్మకంతో క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమయ్యే విధంగా తయారు చేసి వారి సేవలను ప్రజలకు అందించేలా చేశారు. కానీ సార్వత్రిక ఎన్నికల సమయంలో వలంటీర్ల విషయంలో భారత ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికలు ముగిసే వరకు వలంటీర్లు విధులు నిర్వహించరాదని, ప్రజల్లోకి వెళ్లరాదని మార్గదర్శకాలు జారీ చేసింది. వారందరి ఫోన్లను స్వాధీనం చేసుకుంది. దీంతో జగన్ గొంతులో వెలక్కాయపడినట్టు అయ్యింది. దీంతో వైసీపీ నేతలు ఎక్కడికక్కడ వలంటీర్లతో రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకుని వారికి వివిధ ఆసక్తికర ప్యాకేజీలు ఇచ్చి రాజీనామాలు చేయించుకున్నారు. రాజీనామాలు చేయబోమన్న వారిని భయపెట్టడం కూడా జరిగింది. కొంత మంది అయితే ఏం జరిగే అది జరుగుతుందని తటస్థంగా ఉండిపోయి ఇళ్లకు పరిమితమయ్యారు. కట్ చేస్తే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కూటమికి ఏక పక్షంగా పట్టం కట్టారు. దీంతో అలా తటస్థంగా ఉన్న వలంటీర్లు ఊపిరి పీల్చుకుని తమకు నూతన ప్రభుత్వం అవకాశం ఇస్తుందని ఎదురుచూస్తున్నారు. అయితే రాజీనామాలు చేసిన వారు మాత్రం ఇక మనకు అవకాశాలు ఉండవని యూటర్న్ తీసుకుంటున్నారు. తమకు ఇష్టం లేకుండానే రాజీనామాలు చేశామని, తమను వైసీపీ వాళ్లు భయపెట్టారని ఇప్పుడు చెబుతున్నారు. కొన్ని చోట్ల అయితే బెదిరించిన నాయకులపై కేసులు పెడుతున్నారు. రాజమహేంద్రవరంలో మాత్రం రాజీనామాలు చేసిన వారు కేసులు వరకు వెళ్లలేదు కాని వైసీపీ ముద్రను తొలగించుకుని ఎలాగోలా మళ్లీ ఉద్యోగంలో చేరాలనే ప్రయత్నాలు చేస్తున్నారు.

95 సచివాలయాల్లో సుమారు 1540 మంది..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో 95వార్డు సచివాలయాల ద్వారా నగరంలో సుమారు 1540 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. గత ప్రభుత్వం మొత్తం 1650 మంది వలంటీర్లను తీసుకుంది. కాని వివిధ కారాణాలతో మధ్యలోనే 84 మంది ఆగిపోవడంతో ఆ సంఖ్య 1566కు చేరిం ది. ఎన్నికల ముందు సుమారు 26మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. వైసీపీ అధికారంలోకి వస్తుందని భావించిన వారికి భంగపాటు తప్పలేదు. అయితే తటస్థంగా ఉన్న వలంటీర్లలో కూడా కొంతమంది వైసీపీకి అనుకూలంగా ఉన్నారనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఎందుకంటే వలంటీర్లలో వారిలో వారే ఒకరిపై ఒకరు వివిధ అంశాలపై విభేదించుకుని వారి వైఖరిని బయటపెట్టుకుంటున్నారు. కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో ఒక్కొక్క సచివాయాలనికి సగటున 10నుంచి 15మంది వలంటీర్లు ఉన్నారు. వలంటీర్ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళణ చేస్తే వారిలో ఎంత మంది నిలబడతారో వేచిచూడాలి. ప్రస్తుతానికి వలంటీర్లు వారి వారి సచివాయాలకు వచ్చి వెళ్తున్నారు. రాజీనామా చేసిన వాళ్లు మాత్రం ఎలా మళ్లీ రావాలనే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలిసింది. వచ్చే నెల 1నుంచి పింఛన్ల బట్వాడాలోగా ఈ సమస్యకు ఒక పరిష్కారాన్ని చూపే పనిలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

నేడు ప్రజా సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 23: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం ద్వారా ఈ నెల 24వ తేదీ నుంచి ప్రతి సోమవారం ప్రజల వద్ద నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు కమిషనర్ కె.దినేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. స్పందన కార్యక్రమం స్థానంలో నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారానికి ఫిర్యాదులను మీ కోసం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా స్వీకరిస్తామన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ప్రజలు ఈ మార్పును గమనించాలని కోరారు.

వాసవీక్లబ్ డాన్ టూడస్ట్-2024

రాజమహేంద్రవరంసిటీ, జూన్ 23: రాజమహేంద్రవరం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో డాన్ టూడస్ట్ 2024 ప్రోగ్రాం ఆదివారం నిర్వహించారు. బ్లైండ్ స్కూల్ విద్యార్థులకు చేతికర్రలు, నేతాజీ స్కూల్‌కు చెందిన విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, ట్రాఫిక్ పోలీసులకు మాస్కులు, రుమాళ్ళు, ఓల్డేజ్ హోమ్‌కు సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వీరభద్ర రా వు, గార్లపాటి శ్రీనివాస్, సీతామహాలక్ష్మి,చంద్రగుప్త తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి సింహాసనం అందజేత



రాజానగరం, జూన్ 23: రిటైర్డ్ హెచ్‌ఎం ఆర్‌ఎస్ వెంకట్రావు జయంతి సందర్భంగా ఆయన కుమారులు ఆర్.రామబ్రహ్మం, ఆర్‌వీవీఎస్‌ఎస్ మూర్తి రాజానగరంలోని శ్రీరాజలింగేశ్వర, వేణుగోపాల స్వామి దేవస్థానం(శివాలయం)నికి టేకు కర్రతో తయారు చేసిన నెమలి సింహాసనం బహూకరించారు. స్వామి కల్యాణోత్సవాలు జరిపించేందుకు అందజేసినట్టు ఆలయార్చకులు కూచిమంచి శ్రీనివాసరావు తెలిపారు.

ప్రత్యేక అవకాశాలు కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి రెల్లికుల సంక్షేమ సంఘం వినతి


సమావేశంలో ఐక్యత అభివాదం చేస్తున్న రెల్లీలు

రాజమహేంద్రవరంసిటీ, జూన్ 23: ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రెల్లి కులాలకు కూటమి పాలనలో ప్రత్యేక అవకాశాలు కల్పించాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నీలాపు వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొడుగుకుమార్, కోశాధికారి బంగారు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఇసుకపల్లి వెంకటేశ్వరరావు, బంగారు ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రాజ్‌కుమార్, ముత్యాల మురళి తదితరులు పాల్గొన్నారు.

పారా మిలటరీ దళం సేవలు మరువలేనివి

- కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


మాజీ పారా మిలటరీ సిబ్బందితో ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూన్ 23: దేశ రక్షణకై సరిహద్దుల్లో నిరంతరం శ్రమిస్తూ తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలు ప్రాణాలను కాపాడుతున్న పారా మిలటరీ సైనికుల సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం పారా మిలటరీ సంక్షేమ సేవా సంఘం కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే మాట్లాడుతూ సైనికుల కుటుంబాలకు సేవలు అందించడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. పారా మిలటరీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లి ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2012లో జారీ చేసిన 2711 మెమొరాండమ్ ప్రకారం సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్‌గా పిలవబడే బీఎస్‌ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, సీఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎస్‌బీ, అస్సాం రైఫిల్ బలగాలను మాజీ సర్వీస్‌మ్యాన్‌లుగా భావించి డిఫెన్స్ సర్వీసెస్, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వారికి అందజేస్తున్న విధంగా పారా మిలటరీ సిబ్బందికి సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. ప్రత్యేక కార్పోరేషన్లు ఏర్పాటుచేసి నిధులు కేటాయించాలన్నారు. రిటైర్డ్ సిబ్బందికి పోలీసుశాఖలో అనుసంధానంగా విధులు నిర్వర్తించిన ఎస్‌పీవో రద్దు పరచిన పోస్టులను పునః ప్రారంభించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను, సబ్ కలెక్టర్ సత్కరించారు.

పంట కాలువల పరిశీలన

మండలంలోని నందమూరు రోడ్‌లో పంట కాలువలను ఎమెల్యే ముప్పిడి టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. వర్షాకాలంలో దృష్ట్యా పంట కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తీయించడానికి ఎస్టిమేట్లు తయారుచేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. నియోజకవర్గంలో పంట కాలువల పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సమాజానికి సేవలందించాలి

కొవ్వూరు యువరాజ్ కళ్యాణ మండపంలో జరిగిన లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ముప్పిడి ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యవర్గాన్ని అభినందించారు. సమాజానికి సేవలందిస్తూ మానవజన్మను సార్థకం చేసుకోవాలన్నారు. కాగా అధ్యక్షుడిగా మద్దిపాటి సత్యనారాయణ, కార్యదర్శిగా నా మన బుల్లిరాజు, కోశాధికారిగా నాళం శ్రీనివాసరావులతో మాజీ డిస్ట్రిక్ గవర్నర్ కొత్తపల్లి రవికుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యేను నూతన కార్యవర్గం సత్కరించింది. కార్యక్రమాల్లో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, డీటీ కె.అజయ్‌బాబు, నాదెండ్ల శ్రీరామ్, కొప్పాక విజయ్‌కుమార్, సుంకర సత్తిబాబు, పాలింపాటి చిన్నబాబు, కలగర వెంకట్రావు, పెనుమాక జయరాజు, ఉప్పులూరి రామకృష్ణ మాజీ పారా మిలటరీ సిబ్బంది బి.రాజేశ్వరరావు, వి.తాతారావు, వి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్

- బీజేపీ వ్యవస్థాపక అధ్యక్షుడికి ఘన నివాళి

కొవ్వూరు, జూన్ 23 భారతదేశంలో అంతర్భాగమైన కాశ్మీర్‌లో భారతీయులకు హక్కులు లేకుండా చేసిన ఆర్టికల్ 370 విధానాన్ని రద్దు చేయాలని ఒకటే దేశం ఒకటే జెండా ఉండాలనే సంకల్పంతో ప్రాణత్యాగం చేసిన డా. శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలను మరువలేమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ కార్యక్రమాన్ని కొవ్వూరులోని గౌతమీనగర్‌లో నిర్వహించారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జి పిల్లలమర్రి మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసి ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పిం చారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ కేంద్ర మంత్రి పదవిని సైతం రాజీనామా చేసి 370 ఆర్టికల్ రద్దుచేయాలి అనే ఉద్యమాన్ని ప్రారంభించాన మహోన్నతుడు ముఖర్జీ అని, ప్రధాని మోదీ ఆర్టికల్ 370ని రద్దు చేసి ఒకే దేశం ఒకే జెండా అని నిరూపించారన్నారు. కార్యక్రమంలో బోడపాటి ముత్యాలరావు, తాడిమళ్ల విజయవాణి, ఎం.రామచంద్రరావు, ఎం.శ్రీనివాసరావు, కె.శర్మ, ఆర్.వెంకటలక్ష్మి, సంస్కృత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లులోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలు సాధనలో నేటి బీజేపీ నాయకులు సమర్థవంతంగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బూసి సురేంద్రనాథ్ బెనర్జీ, మండలాధ్యక్షుడు మద్దిపాటి సురేష్, తాళ్ళూరి వరప్రసాద్, కరుటూరి జగన్, కె.సుబ్బారావు పాల్గొన్నారు.


కొవ్వూరులో ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెరవలి: మండలంలోని తీపర్రు, అన్నవరప్పాడు, నడిపల్లి, ఉసులమర్రు, కాపవరం, అజ్జరం, మల్లేశ్వరం, గ్రామాల్లో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు సింహాద్రి సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో తొలి హిందూ వాద రాజకీయ పార్టీని స్థాపించిన ముఖర్జీ ఆధునిక హిందుత్వ జాతీయ హోదాన్ని ప్రగాఢంగా విశ్వసించారన్నారు. కార్యక్రమంలో రంగినీడి గంగాధరరావు, కరుటూరి సుబ్బారావు పాల్గొన్నారు.


చాగల్లులో ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


పెరవలి: తీపర్రులో ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

కడియం/రాజమహేంద్రవరం రూరల్, జూన్ 23: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను, ఎల్‌ఐసీని ప్రభుత్వరంగంలోనే ఉంచేందుకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కృషి చేయాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం నాయకుడు పులగుర్త సాయిబాబా ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. పలు ప్రైవేటు సంస్థల్లో కాంట్రాక్టులో పనిచేస్తున్న సెక్యూరిటీ, క్లీనింగ్ సిబ్బంది జీతాల్లోంచి పీఎఫ్ రికవరీ చేసి ఈపీఎఫ్‌వోకు జమ చేయని సందర్భాలెన్నో ఉన్నాయన్నారు. ఇటువంటి సందర్భాల్లో ఎల్‌ఐసీ యూనియన్లు, ఇతర సంఘాలు ముందుకొచ్చి కార్మికుల పీఎఫ్ జమ చేయిస్తున్నారని సాయిబాబా పేర్కొన్నారు.

గోదావరిలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం



కొవ్వూరు, జూన్ 23: కొవ్వూరు గోదావరి నదిలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహాన్ని పోలీసులు ఆదివారం గుర్తించారు. కొవ్వూరులోని గోష్పాద క్షేత్రంలో ఆత్మీయ హితకారిణి సమాజం దార్మిక భవనం సమీపంలో 50 నుంచి 60 సంవత్సరాల వయసున్న వృద్ధురాలి మృతదేహం తేలుతుందని స్థానికుల ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నది నుంచి మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు.

49 ఏళ్ల తర్వాత కలిశారు..

చాగల్లు, జూన్ 23: చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1974-75 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. నెలటూరు శ్రీసీతారామస్వామి కల్యాణ మండపంలో కుటుంబ సమేతంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి అల్లరి చేష్టలు, మధుర క్షణాలను స్మరించుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఆనాటి గురువులు రత్నబాల, కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, విజయలక్ష్మిలకు జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. బీఎస్‌ఎల్‌వీ ప్రసాద్, జి.బాపూజీ, జి.మనోహర్, షేక్ జానీ బాషా, ఎన్.ఉమాదేవి, టి.వీరమణి ఎ.బేబీ సరోజిని, డి.సరస్వతి తదితరులు కార్యక్రమం విజయవంతం కావడానికి ఉత్సాహంగా కృషి చేశారు.



ఎమ్మెల్యే గోరంట్లకు అభినందనల వెల్లువ


ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అగ్నిమాపక అధికారులు

కడియం/రాజమహేంద్రవరంరూరల్, జూన్ 23: సార్వత్రిక ఎన్నికల్లో ఘన ఎమ్మెల్యేగా విజయం సాధించిన గోరంట్ల బుచ్చయ్యచౌదరిని అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ రమణ, పలువురు ప్రభుత్వ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, విశ్రాంత ఉద్యోగులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి పుష్పగుచ్చాలు అందజేశారు.

మృతురాలి ఆచూకీ లభ్యం

కొవ్వూరు, జూన్ 23: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి మృతిచెందిన మహిళ ఏలూరు జిల్లా తంగెళ్లమూడికి చెందిన బడిపట్ల పార్వతి(74)గా పోలీసులు గుర్తించారు. గోదావరి నదిలో మునిగి మృతిచెందిందని సమాచారం తెలుసుకున్న మృతురాలి కుమారులు కొవ్వూరు పోలీసుస్టేషన్ వచ్చారు. పార్వతి భర్త 6 నెలల క్రితం మరణించారని, అప్పటినుంచి ఆమె మనస్తాపంతో ఉందని చెప్పారు. కాగా పార్వతి చిన్న కుమారుడు వద్దే ఉంటోంది. కుమారుడు తన వల్ల ఇబ్బందులు పడుతున్నాడని బాధపడుతుండేదని పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం మృతురాలు బంధువులకు అప్పగించారు. మృతురాలి కుమారుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు.

నిధుల దారి మళ్లింపుపై విచారణ చేపట్టాలి

సర్పంచ్‌ల చాంబర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు

కొవ్వూరు, జూన్ 23: గ్రామ పంచాయతీ నిధులను దారిమళ్లించిన అధికారులపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని సర్పంచ్‌ల చాంబర్ జిల్లా అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో పంచాయతీ రాజ్ శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొణిదల పవన్‌కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీల నిధులు రూ.8629 కోట్లు దారిమళ్లించిన బాధ్యు లు, అధికారులను కఠినంగా శిక్షించాలన్నారు. విచారణ చేపట్టి నిధులను పంచాయతీలకు తిరిగి అప్పగించాలన్నారు. రాష్ట్రంలోని 12918 గ్రామ పంచాయతీలకు కేంద్రం 14, 15 ఆర్థిక సంఘాల ద్వారా, ఉపాధి హామీ పథకం ద్వారా వేల కోట్ల నిధులు పంపితే వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని లక్ష్మణరావు అన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	మనమే
వై.స్క్రీన్2	మహారాజ
దేవిశ్రీ(గాయత్రి)	హరోంహర
అనన్య	తమ్ముడు
నిడదవోలు	
వీ మ్యాక్స్	మనమే
రాధాకృష్ణ	మహరాజా
శ్రీగణపతి	హరోంహర
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	గంగం గణేశా
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---